WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాదరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
94940 54338
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 10, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజిలు : 8, వెల రూ. 5, గురువారం - 12 - జూన్ - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## కరోనా ఎఫెక్ట్.. ప్రధాని మోదీతో భేటీ కావాలంటే ఈ టెస్టు తప్పనిసరి

- దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- 7 వేలు దాటిన యాక్టివ్ కేసుల సంఖ్య
- ప్రధాని మోదీని కలిసే వారికి ఆర్టీ-పీసీఆర్ పరీక్ష తప్పనిసరి
- గడిచిన 24 గంటల్లో 306 కొత్త కేసులు నమోదు
- కేరళలో అత్యధికంగా 2,223 యాక్టివ్ కేసులు



న్యూఢిల్లీ : దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి మరోసారి ఆందోళన కలిగిస్తోంది. పాజిటివ్ కేసులసంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం మిగతా.. 2లో

## నేను రాయల్ ఛాలెంజే తాగను.. ఆర్సీబీని కొంటానా?: డీకే శివకుమార్



ఆర్సీబీ కొనుగోలు వార్తలను కొట్టిపారేసిన కర్ణాటక డిప్యూటీ సీఎం
ఐపీఎల్ ఫ్రాంచైజీని కొనే ఉద్దేశం తనకు లేదని స్పష్టీకరణ
"నేను రాయల్ ఛాలెంజ్ కూడా తాగను" అంటూ చమత్కరించిన డీకే
ఆర్సీబీ అమ్మకంపై ఎలాంటి చర్చలు జరగడం లేదన్న
ప్రస్తుత యాజమాన్యం దయాజియో
ఐపీఎల్ టైటిల్ గెలిచిన ఆర్సీబీ అమ్మకంపై వదంతులు

## నేను ఉన్నంత కాలం కాంగ్రెస్‌లోకి కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదు: రేవంత్ రెడ్డి

- రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై ఢిల్లీలో చర్చ జరగలేదు
- రెండు రోజుల్లో కాళేశ్వరం డాక్యుమెంట్లు బయటపెడతామని వెల్లడి
- తెలంగాణ ప్రాజెక్టులకు కిషన్ రెడ్డి నిధులు తేలేదని విమర్శ



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాను పదవిలో ఉన్నంత కాలం కేసీఆర్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీలో ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. ఆ కుటుంబమే తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన శత్రువని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బుధవారం మీడియాతో నిర్వహించిన మిగతా.. 2లో

## చదువుకునే పిల్లలందరికీ 'తల్లికి వందనం'

- కొత్త విద్యా సంవత్సరం వేళ 'తల్లికి వందనం' పథకానికి సీఎం ఆమోదం
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పూర్తి సందర్భంగా ఈ పథకం అమలు
- చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా ప్రతి తల్లికీ లబ్ది
- 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.8745 కోట్లు జమ
- ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, దీపం-2 అమలు



అమరావతి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాదిపాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ విద్యార్థుల తల్లులకు శుభవార్త అందించింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకం అమలుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. మిగతా.. 2లో

## కొణిదెల గ్రామానికి పవన్‌కల్యాణ్ రూ.50 లక్షల అందజేత

- పవన్‌కల్యాణ్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కలిసి కొణిదెల గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు



2

- తమ ఇంటి పేరు కలిగిన గ్రామాన్ని సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని హామీ
- ఈ నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించాలి

## దేశంలో 7,121కి పెరిగిన క్రియాశీల కేసులు.. 24 గంటల్లో ఆరుగురు మృతి




2

రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..
కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,223 కేసులు

## అనుమతి తీసుకోలేదు, అతి ప్రచారం చేశారు తొక్కిసలాట ఘటనలో ఆర్సీబీదే తప్పన్న కర్ణాటక ప్రభుత్వం

2లో



బెంగళూరు తొక్కిసలాట ఘటనపై హైకోర్టులో విచారణ
ఆర్సీబీ, కేఎస్‌సీఏపై కర్ణాటక ప్రభుత్వ తీవ్ర ఆరోపణలు
విక్టరీ పరేడ్‌కు అనుమతులు తీసుకోలేదని వెల్లడి

## కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించిన కాళేశ్వరం కమిషన్



2

- పార్టీ నేతలతో కలిసి బీఆర్కే భవన్ కు వచ్చిన బీఆర్ఎస్ అధినేత
- అనారోగ్యం కారణంగా ఇన్ కెమెరా విచారణను ఎంచుకున్న మాజీ సీఎం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఫైల్ ఇచ్చిన కేసీఆర్

## మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు: వైఎస్ జగన్

**రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి.**

- రాష్ట్రంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదు
- చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు
- రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు
- చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు



ప్రకాశం: రాష్ట్రంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదని, చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపమని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పొదిలి పొగాకు బోర్డును సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇవాళ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదు. మిగతా.. 2లో



## ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారు

### మంత్రి పొంగులేటి

ములుగు: గత భారాస ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ములుగులో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారని ధ్వజమెత్తారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని, ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



2

## మంగ్లీ పుట్టినరోజు వేడుకల్లో డ్రగ్స్ కలకలం.. రిసార్ట్‌పై పోలీసుల దాడి.. గంజాయి స్వాధీనం!

సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుకలపై పోలీసుల ఆకస్మిక దాడులు

## మంత్రి పదవి లేకపోయినా.. రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



2

## సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది
ఈ సందర్భంగా నేడు తల్లులకు కానుకగా తల్లికి వందనం పథకం ప్రారంభం
నేడే తల్లికి వందనం నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వ నిర్ణయం
67,27,164 మంది విద్యార్థులకు పథకం వర్తింపు
ఈ పథకం కింద రేపు తల్లుల ఖాతాల్లోకి
రూ. 8,745 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం



2

## భారతీయుడిపై అమెరికాలో దురుసు ప్రవర్తన

### వైరల్ వీడియోపై భారత్ స్పందన

అమెరికా: అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో ఇటీవల ఒక భారతీయ యువకుడి పట్ల అక్కడి భద్రతాధికారులు వ్యవహరించిన తీరు విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దుమారం రేగింది. తాజాగా ఈ ఉదంతంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. సదరు యువకుడు నిబంధనలకు విరుద్ధంగా, సరైన వీసా లేకుండా అక్రమంగా అమెరికా వెళ్ళాడని, అతని ప్రవర్తన కూడా సరిగా లేదని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. విదేశాంగ శాఖ వర్గాల కథనం ప్రకారం, హర్యానాకు చెందిన ఈ యువకుడి ప్రవర్తన ప్రయాణ సమయంలో ఆమోదయోగ్యంగా లేదని తెలిసింది. "ఆ యువకుడు తప్పు చేశాడు. సరైన పత్రాలు లేకుండా అక్రమంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోకి ప్రవేశించాడు. అతని ఆరోగ్యం కుదుటపడిన తర్వాత, అతడిని తిరిగి భారతదేశానికి పంపించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విషయమై అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఎంఈఏ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, యువకుడు అక్రమంగా ప్రవేశించి ఉండవచ్చని అంగీకరిస్తూనే, భద్రతా సిబ్బంది అతనిపై వ్యవహరించిన తీరుపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యువకుడిని నేలపై పడేసి, చేతులను వెనక్కి విరిచి కట్టేసిన దృశ్యాలు తీవ్ర ఆందోళన కలిగించాయి. ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కావని భారత్ స్పష్టం చేసింది. అక్రమ వలసదారుల విషయంలో అమెరికా కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. గతంలో ట్రంప్ పరిపాలన నుంచి ఈ వైఖరి మరింత కఠినతరమైంది. అనేక మంది అక్రమ వలసదారులను, వారిలో భారతీయులతో సహా, పలువురిని స్వదేశాలకు తిప్పి పంపించారు. ఈ నేపథ్యంలో, పౌరులు సరైన పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లవద్దని భారత ప్రభుత్వం పదేపదే హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. అయినప్పటికీ, కొందరు అక్రమ మార్గాలను ఆశ్రయిస్తూనే ఉన్నారు.

## కొణిదెల గ్రామానికి పవన్‌కల్యాణ్ రూ.50 లక్షల అందజేత

నంద్యాల పట్టణం: నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలో తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రూ.50 లక్షలు అందజేశారు. కర్నూలు జిల్లా పూడిచెర్లలో ఇటీవల పంటకుంట నిర్మాణాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న పవన్‌కల్యాణ్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కలిసి కొణిదెల గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. అందుకు స్పందించిన ఆయన.. తమ ఇంటి పేరు కలిగిన గ్రామాన్ని సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు తాజాగా రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును నంద్యాల కలెక్టరేట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి డీఆర్వో రామునాయక్, పరిపాలనాధికారి రవికుమార్, సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావులకు అందజేశారు. ఈ నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. కొణిదెలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించిందని, గ్రామస్థుల అభ్యర్థన ప్రకారం గ్రామంలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మించడంతో పాటు రోడ్లు, మురుగు కాల్వలు, ఇతర వసతులు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించిన కాళేశ్వరం కమిషన్

హైదరాబాద్ : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను కాళేశ్వరం కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. ఈ రోజు మధ్యాహ్నం హరీశ్ రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలతో కలిసి కేసీఆర్ బీఆర్కే భవన్ కు చేరుకున్నారు. స్వల్ప అనారోగ్యాన్ని కారణంగా చూపుతూ ఇన్ కెమెరా విచారణను కేసీఆర్ ఎంచుకున్నారు. దీంతో ఓపెన్ కోర్టులో ఉన్న వారందరినీ అధికారులు బయటకు పంపించారు. అనంతరం జస్టిస్ పీసీ ఘోష్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ప్రశ్నించారు. ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్, ఆనకట్టల నిర్మాణం, ఒప్పందాలు, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, నీటి నిల్వ తదితర అంశాలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్ వివిధ డాక్యుమెంట్లను జస్టిస్ పీసీ ఘోష్ కు అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఫైలును కూడా అందించినట్లు పేర్కొన్నాయి. కాగా, ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ 114 మందిని విచారించింది. ఇన్నాళ్లూ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించింది. ఇటీవల మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావులను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సీపేజీ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు గతేడాది మార్చిలో కాళేశ్వరం కమిషన్ ను ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో ఈ కమిషన్ ను ఏర్పాటు చేసింది.

స్వల్ప అనారోగ్యాన్ని కారణంగా చూపుతూ ఇన్ కెమెరా విచారణను కేసీఆర్ ఎంచుకున్నారు. దీంతో ఓపెన్ కోర్టులో ఉన్న వారందరినీ అధికారులు బయటకు పంపించారు. అనంతరం జస్టిస్ పీసీ ఘోష్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ప్రశ్నించారు. ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్, ఆనకట్టల నిర్మాణం, ఒప్పందాలు, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, నీటి నిల్వ తదితర అంశాలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్ వివిధ డాక్యుమెంట్లను జస్టిస్ పీసీ ఘోష్ కు అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఫైలును కూడా అందించినట్లు పేర్కొన్నాయి. కాగా, ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ 114 మందిని విచారించింది. ఇన్నాళ్లూ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించింది. ఇటీవల మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావులను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సీపేజీ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు గతేడాది మార్చిలో కాళేశ్వరం కమిషన్ ను ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో ఈ కమిషన్ ను ఏర్పాటు చేసింది.

### దేశంలో 7,121కి పెరిగిన క్రియాశీల కేసులు..

## 24 గంటల్లో ఆరుగురు మృతి

న్యూఢిల్లీ : దేశంలో మరోసారి కరోనా వైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇక నిన్న ఒక్కరోజే 300కిపైగా కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 7 వేలు దాటింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం .. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ 306 మందికి పాజిటివ్‌గా తేలింది. కేరళలో అత్యధికంగా నిన్న ఒక్కరోజే 170 కేసులు బయటపడ్డాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 114 కేసులు వెలుగు చూశాయి. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121కు పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 8,573 మంది మహమ్మారిబారి నుంచి కోలుకున్నారు. 24 గంటల్లో ఆరు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో ఒకరు, కర్ణాటకలో ఇద్దరు, కేరళలో ముగ్గురు కొవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 74కి ఎగబాకింది.

### రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,223 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్ (1,223), ఢిల్లీ (757), పశ్చిమ బెంగాల్ (747), మహారాష్ట్ర (615), కర్ణాటక (459), ఉత్తరప్రదేశ్ (229), తమిళనాడు (204), రాజస్థాన్ (138), హర్యాణా (125), ఆంధ్రప్రదేశ్ (72), మధ్యప్రదేశ్ (65), ఛత్తీస్‌గఢ్ (48), బీహార్ (47), ఒడిశా (41), సిక్కిం (33), పంజాబ్ (33), తెలంగాణ (11), జార?ండ్ (10), పుదుచ్చేరి (10), జమ్ము కశ్మీర్‌లో తొమ్మిది, అస్సాం, గోవా రాష్ట్రాల్లో ఆరు చొప్పున, ఛండీగఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మూడు చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో రెండు కేసులు, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు యాక్టివ్‌గా ఉంది.

### కరోనా ఎఫెక్ట్.. ప్రధాని మోదీతో భేటీ

## కావాలంటే ఈ టెస్టు తప్పనిసరి

మొదటి పేజి తరువాయి

పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసే మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తాజాగా నమోదవుతున్న కేసులతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7 వేలు దాటింది. బుధవారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా 306 కొత్త కరోనా కేసులు వెలుగుచూశాయి. దీంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారి సంఖ్య 7,121కి చేరింది. ఇప్పటివరకు దేశంలో కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 74కు పెరిగింది. ఈ పరిస్థితుల దృష్ట్యా, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని ఆరోగ్య శాఖ సూచించింది. ముఖ్యంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యే కేంద్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ముఖ్యమైన వ్యక్తులు తప్పనిసరిగా ఆర్టీ-పీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను కూడా పీఎంఓ అధికారులు చేస్తున్నారని సమాచారం. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం 7,121 యాక్టివ్ కేసుల్లో కేరళలో అత్యధికంగా 2,223 కేసులు ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో గుజరాత్ (1,223), ఢిల్లీ (757), పశ్చిమ బెంగాల్ (747), మహారాష్ట్ర (615), కర్ణాటక (459) రాష్ట్రాలు నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 72 యాక్టివ్ కేసులు ఉండగా, తెలంగాణలో 11 కేసులు నమోదయ్యాయి. ఉత్తర ప్రదేశ్‌లో 229, తమిళనాడులో 204, రాజస్థాన్‌లో 138, హర్యానాలో 125, మధ్యప్రదేశ్‌లో 65, ఛత్తీస్‌గఢ్‌లో 48, బీహార్‌లో 47, ఒడిశాలో 41, సిక్కిం, పంజాబ్‌లలో ఒక్కో రాష్ట్రంలో 33 చొప్పున కేసులు ఉన్నాయి. పుదుచ్చేరి, ఝార?ండ్‌లలో చెరో 10, జమ్ముకశ్మీర్‌లో 9, అసోం, గోవాలలో 6 చొప్పున, చండీగఢ్, ఉత్తరాఖండ్‌లలో 3 చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో 2, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# అనుమతి తీసుకోలేదు, అతి ప్రచారం చేశారు



బెంగళూరు: ఐపీఎల్ విజేతగా నిలిచిన ఆర్సీబీ జట్టు విజయోత్సవ ర్యాలీ సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం ఆర్సీబీ యాజమాన్యం పైనా, బీసీసీఐ పైనా తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించింది. విజయోత్సవ కార్యక్రమానికి నిర్వాహకులు ఎలాంటి ముందస్తు అనుమతులు పొందలేదని, కేవలం సమాచారం మాత్రమే ఇచ్చారని ప్రభుత్వం కోర్టుకు నివేదించింది. అంతేకాకుండా, ఆర్సీబీ జట్టు తమ సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా ఈవెంట్‌కు విపరీతమైన ప్రచారం కల్పించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుందని ప్రభుత్వం వాదించింది. ఈ తొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి, ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసలేతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ అరెస్టును సవాలు చేస్తూ వారు కర్ణాటక హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం ముందు కర్ణాటక ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి తమ వాదనలు వినిపించారు. "విజయోత్సవ ర్యాలీ నిర్వహణ కోసం వారు ముందుగా ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. కేవలం ప్రభుత్వానికి సమాచారం మాత్రమే అందించారు. జూన్ 3వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరగడానికి కేవలం గంట ముందు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం నుంచి ఒక లేఖ అందింది. అందులో పరేడ్‌కు అనుమతి ఇవ్వాలన్న అభ్యర్థన ఏమీ లేదు. కేవలం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాత్రమే తెలిపారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం" అని అడ్వొకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, "ఈ విక్టరీ పరేడ్ గురించి ఆర్సీబీ జట్టు అర్ధరాత్రి నుంచే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసింది. టికెట్లు లేదా ప్రవేశానికి సంబంధించిన సరైన సమాచారం ఇవ్వకుండానే అభిమానులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చింది. దీని ఫలితంగానే సుమారు 3.5 లక్షల నుంచి 4 లక్షల మంది అభిమానులు స్టేడియం గేట్ల వద్దకు పోటెత్తారు" అని ప్రభుత్వ తరఫు న్యాయవాది వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నట్లుగా ప్రచారం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ ఇది పూర్తిగా ఆర్సీబీ నిర్వహించిన ప్రైవేటు ఈవెంట్ అని ప్రభుత్వం స్పష్టం చేసింది. "మైదానం వద్ద భద్రత, గేట్ల నిర్వహణ, టికెట్ల జారీ వంటి అంశాలకు సంబంధించి ఆర్సీబీ మరియు బీసీసీఐ మధ్య ఒప్పందం ఉంది. కాబట్టి, ఈ ఘటనకు బీసీసీఐ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈవెంట్ సమయంలో కనీస ఏర్పాట్లు కూడా సరిగా లేవు. సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు" అని కర్ణాటక ప్రభుత్వం కోర్టులో ఆరోపించింది.

## మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు




మొదటి పేజి తరువాయి

రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో(పరుచూరు, కొండెపి) ఇటీవలే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. మా హయాంలో రైతు రాజ్యం నడిచింది. కానీ, కూటమి ప్రభుత్వంలో రైతు నష్టపోతున్నాడు. మా హయాంలో ఖరీఫ్ సీజన్‌లోనే పెట్టుబడి సాయం అందించాం. చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా మరో రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు అన్నారు. గతేడాది రైతు భరోసా రూ.20 ఎగ్గొట్టారు. మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు

మా హయాం.. రైతులకు స్వర్ణయుగం

మా ప్రభుత్వంలో రైతుకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ప్రతీ రైతుకు అదనంగా రూ.10 వేలు ఇచ్చేవాళ్లం. పారదర్శకంగా ఉచిత బీమా అందించాం. మా హయాంలో రైతుకు వెన్నెముకగా ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు)లు నిలిచాయి. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. మార్కెట్‌లో పోటీ పెరిగి రైతుకు గిట్టుబాటు ధర వచ్చేది. కేంద్రం ప్రకటించిన పంటలకే కాకుండా.. రాష్ట్రం నుంచి అనేక పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ఏ పంటకైనా గిట్టుబాటు ధర లేకుంటే ఆర్బీకే ద్వారా ఇచ్చేవాళ్లం. ఐదెకరాల మిర్చి రైతులకు రూ.4లక్షల పరిహారం ఇచ్చిన ఘనత మాది. మా హయాంలో రైతులకు సువర్ణ యుగం. ఏ రకంగానూ రైతును నష్టపోనివ్వలేదు.

### కూటమి పాలనలో అధ్వానం

కూటమి వచ్చాక ఉచిత బీమా ఎత్తేశారు. దళారీలు లేకుండా ఇప్పుడు పంట కొనే పరిస్థితి లేదు. ఈ క్రాప్ వ్యవస్థను నీరుగార్చారు. కూటమి వచ్చాక ఇన్‌పుట్ సబ్సిడీని గాలికొదిలేశారు. కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలతో నష్టపోతున్నారు. 2023-24లో కేజీ పొగాకు రూ.366కి అమ్ముడుపోయేది. ఇప్పుడు రూ.240 కూడా అమ్ముడుపోవడం లేదు. క్వింటా పొగాకు రూ.24 వేలు తగ్గకుండా రైతు అమ్ముకున్నాడు. 220 మిలియన్ టన్నులు ప్రొక్యూర్ చేయాల్సి ఉంటే.. కేవలం 40 మిలియన్ టన్నులే ప్రొక్యూర్ చేశారు. హైగ్రేడ్ పొగాకుకు కూడా ఈరోజు గిట్టుబాటు ధర దక్కడం లేదు. పొగాకు బ్లాక్ బర్లీ రైతు ఎకరాకు రూ.80వేలు నష్టపోతున్నాడు. చంద్రబాబు సీఎం కావడం రైతులకు శాపం. మా హయాంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాం. మార్క్‌ఫెడ్ రావడంతో మార్కెట్‌లో పోటీ పెరిగింది. మీరెందుకు ఆ పని చేయలేదు?. అసలు ప్రభుత్వం ఎందుకు మార్క్‌ఫెడ్ వేలంలో పాల్గొనలేదు. బాబు, దళారుల మధ్య సంబంధాలతో రైతులు నష్టపోతున్నారు.

### చంద్రబాబుకు జగన్ హెచ్చరిక

వ్యవసాయం దండగ అనే రీతిలో చంద్రబాబు పాలన కొనసాగుతోంది. పొగాకు వేసుకోమని చెప్పి రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం జగన్ హెచ్చరికలు జారీ చేశారు.

## చదువుకునే పిల్లలందరికీ 'తల్లికి వందనం'

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో ఆర్థిక సహాయం జమ చేయనున్నట్లు ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల 27 వేల 164 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. వీరి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం మొత్తం రూ. 8745 కోట్లు జమ చేయనుంది. ఒకటో తరగతిలో కొత్తగా అడ్మిషన్ పొందే చిన్నారులతో పాటు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని మంత్రి వివరించారు. విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లులకు మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని గుర్తు చేశారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డీఎస్సీ ప్రకటన, దీపం-2 పథకాల అమలు దిశగా చర్యలు తీసుకున్నామని, తాజాగా 'తల్లికి వందనం' పథకం అమలుతో మరో ముఖ్యమైన హామీని నిలబెట్టుకున్నామని లోకేష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఈ పథకానికి పచ్చజెండా ఊపడం సంతోషకరమని ఆయన అన్నారు.


### నేను ఉన్నంత కాలం కాంగ్రెస్‌లోకి

## కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదు

ఢిల్లీలో బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, మంత్రులకు శాఖల కేటాయింపు అంశంపై ఢిల్లీలో అధిష్ఠానంతో ఎటువంటి చర్చలు జరగలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ చేరుకున్న తర్వాత పార్టీలోని ముఖ్య నేతలందరితో సంప్రదింపులు జరిపి, ఆ తర్వాతే శాఖల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా కర్ణాటకలో కులగణన అంశంపై మాత్రమే అధిష్ఠానంతో చర్చించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను బహిర్గతం చేస్తానని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, ఇతర అంశాలపై స్పష్టత ఇస్తామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా కిషన్ రెడ్డి కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేకపోయారని ఆయన విమర్శించారు. ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా కర్ణాటకలో కులగణన అంశంపై మాత్రమే అధిష్ఠానంతో చర్చించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను బహిర్గతం చేస్తానని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, ఇతర అంశాలపై స్పష్టత ఇస్తామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా కిషన్ రెడ్డి కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేకపోయారని ఆయన విమర్శించారు.

### సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన

## హామీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్



అమరావతి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా రేపు తల్లులకు కానుకగా తల్లికి వందనం పథకం అమలు చేయనున్నట్లు ఏపీలోని కూటమి ప్రభుత్వం వెల్లడించింది. రేపే తల్లికి వందనం నిధులు విడుదలకు ప్రభుత్వం నిర్ణయించింది. 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం నిధులు రేపు ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం తెలిపింది. కాగా, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకుంది. దీంతో 67,27,164 మంది విద్యార్థులకు పథకం వర్తింపజేయనుంది. ఇందులో భాగంగా తల్లుల ఖాతాల్లో రేపు ప్రభుత్వం రూ. 8,745 కోట్లు జమ చేయనుంది. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు కానుంది. అడ్మిషన్ల పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. పథకం విధి విధానాలను ఖరారు చేస్తూ అధికారులు ఇవాళ జీఓ విడుదల చేయనున్నారు. ఇక, సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలు అమలు చేసిన విషయం తెలిసిందే.

## నేను రాయల్ ఛాలెంజే తాగను.. ఆర్సీబీని కొంటానా?: డీకే శివకుమార్

బెంగళూరు: ఈ ఏడాది ఐపీఎల్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. బెంగళూరు యాజమాన్యం డియాజియో కంపెనీ ఫ్రాంచైజీని పూర్తిగా లేదా అందులో కొంత వాటాను విక్రయించడానికి సిద్ధమైనట్లు ప్రచారం జరిగింది. ఇప్పటికే పలువురు పెట్టుబడిదారులతో చర్చలు జరిపిందని, ఫ్రాంచైజీ ధరను 2 బిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు రూ.17,032 కోట్లు)గా నిర్ణయించినట్లుగా వ్యాపార వర్గాలు తెలిపాయి. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్సీబీలో వాటాలు కొనుగోలు చేయనున్నట్లు తాజాగా వార్తలొస్తున్నాయి. ఈ విషయంపై ఆయన స్పందించారు. ఇదంతా తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు. 'నేను నా చిన్నప్పటి నుంచి కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌లో సభ్యుడిని, అంతే. ఆర్సీబీ మేనేజ్‌మెంట్‌లో భాగస్వామిగా చేరాలని ఆఫర్‌లు ఉన్నప్పటికీ నాకు సమయం లేదు. నాకు ఆర్సీబీ ఎందుకు అవసరం?' అని డీకే శివకుమార్ అన్నారు. మరోవైపు, బెంగళూరు ఫ్రాంచైజీని అమ్ముతున్నారన్న వార్తలు బయటకు రాగానే మంగళవారం ఉదయం యునైటెడ్ స్పిరిట్స్ షేర్లు 3.3 శాతం పెరగడం విశేషం. 2008లో ఐపీఎల్ ఆరంభ సమయంలో యూబీ గ్రూపు అధినేత విజయ్ మాల్యా బెంగళూరు ఫ్రాంఛైజీని దక్కించుకున్నాడు. తర్వాత మాల్యా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో భారత్‌లోని అనుబంధ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ ద్వారా బెంగళూరు ఫ్రాంచైజీని డియాజియో కొనుగోలు చేసింది. అయితే, ఆర్సీబీ అమ్మకంపై వచ్చిన వార్తలను డియాజియో ఖండించింది.

## మంత్రి పదవి లేకపోయినా.. రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై తాజాగా రాజగోపాల్ రెడ్డి స్పందించారు. తాను మంత్రిగా లేకపోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతానని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తాజాగా ట్విట్టర్ వేదికగా..'తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీకి వచ్చాను. ఈరోజు నేను మంత్రిగా లేకపోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను. నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పనిచేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది. అదే మార్గాన్ని నేను ఎంచుకున్నాను' అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే.

## మంగ్లీ పుట్టినరోజు వేడుకల్లో డ్రగ్స్ కలకలం.. రిసార్ట్‌పై పోలీసుల దాడి.. గంజాయి స్వాధీనం!

హైదరాబాద్ : ప్రముఖ జానపద గాయని మంగ్లీ పుట్టినరోజు వేడుకలు వివాదాస్పదంగా మారాయి. చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌లో అర్ధరాత్రి జరిగిన ఈ వేడుకలపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ పార్టీలో మాదకద్రవ్యాల వినియోగం జరిగిందన్న ఆరోపణలు, అధికారిక అనుమతులు లేకపోవడం, అక్రమంగా సౌండ్ సిస్టమ్స్ వాడటం వంటి పలు ఉల్లంఘనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో పలువురు సినీ ప్రముఖులు కూడా పోలీసుల నిఘాలోకి వచ్చినట్లు తెలుస్తోంది. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భూపాల్ శ్రీధర్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఓ రహస్య సమాచారం ఆధారంగా ఈ దాడి నిర్వహించారు. తనిఖీల సమయంలో దామోదర్ అనే వ్యక్తి పార్టీ జరుగుతున్న ప్రదేశంలో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డాడు. దీంతో, ఈ వేడుకల్లో మాదకద్రవ్యాల వినియోగం ఏ స్థాయిలో జరిగిందనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం, ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా మద్యం సరఫరా చేయడం వంటి కారణాలతో గాయని మంగ్లీపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అలాగే, అవసరమైన అనుమతులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించడానికి అనుమతించినందుకు త్రిపుర రిసార్ట్ జనరల్ మేనేజర్‌పైనా కేసు నమోదు చేశారు. అంతేకాకుండా, ఎలాంటి సౌండ్ పర్మిషన్ లైసెన్స్ లేకుండా ఉపయోగిస్తున్న డీజే పరికరాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్టీకి నటి దివి, సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్‌తో పాటు మరికొందరు ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, పార్టీకి హాజరైన వారికి కూడా పోలీసులు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనతో టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## రంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం.. ముగ్గురు యువకులు మృతి





యాచారం మండలం మాల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. యాచారం మండలం మాల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటున్న ఏడుగురు స్నేహితులు కలిసి నిన్న నాగార్జున సాగర్‌లోకి వైజాగ్ కాలనీకి వెళ్లారు. మళ్లీ అర్ధరాత్రి తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా.. వారి కారును బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదం మాల్ వద్ద నాగార్జున సాగర్ రహదారిపై జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులను మహబూబ్‌నగర్‌కు చెందిన సాయితేజ, పవన్, రాఘవేంద్రగా పోలీసులు గుర్తించారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కోట శ్రీనివాసరావు ఇప్పుడెలా ఉన్నారో తెలుసా.. మరీ ఇంత వీక్ అయిపోయారు.!



తెలుగు సినిమా తెరపై విలక్షణ నటుడుగా పేరు తెచ్చుకున్న కోట శ్రీనివాసరావు తెలుగు సినిమా రంగంపై తనదైన ముద్ర వేశారు. కమెడీయన్, విలన్‌గా తనదైన శైలిలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. ఏ పాత్ర అయిన అవలీలగా పోషించి నవరసాలు పండించగ బహుముఖ నటుడు కోట శ్రీనివాసరావు. తెలుగు సినిమా తెరపై విలక్షణ నటుడుగా పేరు తెచ్చుకున్న కోట శ్రీనివాసరావు తెలుగు సినిమా రంగంపై తనదైన ముద్ర వేశారు. కమెడీయన్, విలన్‌గా తనదైన శైలిలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. ఏ పాత్ర అయిన అవలీలగా పోషించి నవరసాలు పండించగల బహుముఖ నటుడు కోట శ్రీనివాసరావు. టాలీవుడ్‌లో రావు గోపాల రావు తర్వాత తెలుగు విల నిజానికి సరికొత్త సొబగులద్దిన నటుడు కోట అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. దాదాపు ఏడు వందల పైచిలుకు చిత్రాల్లో విభిన్నమైన పాత్రల్లో నటించిన కోట వయోభారం వలన ఇప్పుడు ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. చాలా రోజులుగా కోట మీడియాలో కూడా పెద్దగా కనిపించడం లేదు.రీసెంట్‌గా కోటని ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ కలిసాడు. ఆయన ఇంటికి వెళ్లి మరీ ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఇక కోటతో కలిసి దిగిన ఫోటోను బండ్ల గణేష్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. " కోట శ్రీనివాసరావు గారితో ఈరోజు.. కోటా బాబాయ్ ను కలవడం చాలా సంతోషాన్నిచ్చింది" అంటూ రాసుకురాగా, ఇందులో కోటని చూసి అభిమానులు షాక్ అయ్యారు. ఏంటి మరీ ఇంత వీక్ అయ్యారు. కాలికి కట్టుతో, సన్నబడిపోయి అసలు గుర్తుపట్టలేన్నంతగా మారిపోయారు. ఒకప్పుడు తెరపై తనదైన ముద్ర వేసిన కోటని ఇలా చూసి అభిమనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కోట శ్రీనివాసరావు ఆరోగ్యం క్షీణించిందన్న వార్తలు అభిమానులని ఎంతగానో కలిచి వేస్తున్నాయి. ఆయన ఆరోగ్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు. కోట ఆ మధ్య పలు ఇంటర్వ్యూలలో కొన్ని కాంట్రవర్షియల్ కామెంట్స్ చేసి వార్తలలో నిలవడం మనం చూశాం. స్టార్ హీరోలు, డైరెక్టర్స్‌పై కూడా షాకింగ్ కామెంట్స్ చేశారు. తుదిశ్వాస తీసుకొనేవరకు సినిమాల్లో నటించాలని ఉందని, కానీ, మేకర్స్ ఎవరు తనకు ఛాన్స్ లు ఇవ్వడం లేదని కోట ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. కోటా చివరగా 2023 లో వచ్చిన సువర్ణ సుందరి అనే సినిమాలో కనిపించారు. బాల్యము నుండి కోటకు నాటకాలంటే చాలా ఆసక్తి ఉండేది. సినిమాలలో రాకముందు ఈయన స్టేట్ బ్యాంకులో పనిచేసేవారు.

## రూ.20 లక్షల నగల బ్యాగ్‌ను లాక్కెళ్లిన కోతి.. తర్వాత ఏం జరిగిందంటే?



సుమారు రూ.20 లక్షల విలువైన నగలు ఉన్న బ్యాగ్‌ను ఒక వ్యక్తి నుంచి కోతి లాక్కెళ్లింది. ఆ బ్యాగ్‌ను కోతి నుంచి తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఆ వ్యక్తి పోలీసుల సహాయాన్ని కోరాడు. లక్నో: సుమారు రూ.20 లక్షల విలువైన నగలు ఉన్న బ్యాగ్‌ను ఒక వ్యక్తి నుంచి కోతి లాక్కెళ్లింది. ఆ బ్యాగ్‌ను కోతి నుంచి తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఆ వ్యక్తి పోలీసుల సహాయాన్ని కోరాడు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆ కోతిని చుట్టుముట్టారు. చివరకు దాని నుంచి ఆ బ్యాగ్‌ను తీసుకుని ఆ వ్యక్తికి అప్పగించారు. ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఈ సంఘటన జరిగింది. జూన్ 6న అలీగఢ్‌కు చెందిన వజ్రాల వ్యాపారి అభిషేక్ అగర్వాల్ తన కుటుంబంతో కలిసి బృందావనానికి వెళ్లాడు. అక్కడున్న పలు ఆలయాలను వారు దర్శించారు.కాగా, ఇంటికి తిరిగి వెళ్లేందుకు అభిషేక్ అగర్వాల్ తన కారు వద్దకు నడిచి వెళ్తుండగా ఒక కోతి అతడి చేతిలోని బ్యాగ్‌ను లాక్కెళ్లింది. ఆ బ్యాగ్‌లో రూ.20 లక్షల విలువైన ఆభరణాలు ఉండటంతో అభిషేక్, అతడి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. స్థానికుల సూచన మేరకు ఆ కోతికి పండ్లు, ఆహారం ఇవ్వటం వంటి ఆశపెట్టే ప్రయత్నాలు చేశారు. ఫలితం లేకపోవడంతో పోలీసుల సహాయం కోరారు.మరోవైపు పోలీసులు ఆ కోతిని గుర్తించి దానిని చుట్టుముట్టారు. కొన్ని గంటలపాటు శ్రమించి చివరకు దాని నుంచి బ్యాగ్‌ను తీసుకున్నారు. రూ.20 లక్షల విలువైన నగలున్న ఆ బ్యాగ్‌ను వజ్రాల వ్యాపారి అభిషేక్ అగర్వాల్‌కు అప్పగించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మతపరమైన ఆ పర్యాటక ప్రాంతంలో కోతుల ముప్పును నియంత్రించడానికి అధికారులు పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు

# ఇలా ఘనత వహించిన కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకంలో తాజాగా మరో కలికితురాయి తెరపైకి వచ్చింది



సాగునీటి ప్రాజెక్టులు దేవురుదెరుగు.. ఒక చిన్న చెక్‌డ్యాం లాంటి నిర్మాణాన్ని కూడా పటిష్టంగా పూర్తి చేసి వినియోగంలోకి తేలేని దుస్థితి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ఈ డ్యాం పూర్తయితే శ్రీశైలంలో 365 రోజుల పాటు రివర్స్ పంపింగ్ జరిగే అవకాశం ఉండేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో అది ధ్వంసమై వంద కోట్ల రూపాయలు 'కృష్ణా'ర్పణమయ్యాయి. కాంగ్రెస్ కిరీటంలో ఇన్ని ఘనకార్యాలు పెట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బరాజ్‌లో ఒక్క పిల్లర్ కుంగిపోతే ఆ పార్టీ ప్రభుత్వం చేసే రంధ్రాన్వేషణ.. ప్రభుత్వ పెద్దలు వల్లించే నీతి వ్యాఖ్యాలను చూస్తుంటే 'నవ్విపోదురుగాక!' అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### 2004లో సపోర్ట్ డ్యాం మొదలు

శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రంలో భాగంగా రివర్సబుల్ మోడ్‌లో కూడా టర్బైన్లు తిరుగుతాయి. దీని ద్వారా డ్యాం దిగువన ఉన్న జలాలను తిరిగి డ్యాంలోకి ఎత్తిపోసి.. తిరిగి అదే నీటితో కరెంటు ఉత్పత్తి చేసి దిగువకు వదులుతారు. ఈ క్రమంలో రివర్సబుల్ పంపింగ్ జరగాలంటే నాగార్జునసాగర్‌లో కనీసం 530 అడుగుల నీటిమట్టం ఉండాలి. తద్వారా విద్యుత్తు కేంద్రంలోకి వెళ్లే ఎగ్జిట్ టన్నెల్‌కు నీళ్లు అందుతాయి. ఈ టన్నెల్ డ్యాం దిగువన రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సాగర్‌లో నీటిమట్టం పడిపోతే ఈ రివర్సబుల్ పంపింగ్ నిలిచిపోతుంది. ఇలా కాకుండా 365 రోజులూ రివర్స్ పంపింగ్ జరగాలంటే టన్నెల్‌లోకి నీటి లభ్యత ఉండాలి. ఇందుకోసం 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని వజ్రాలమడుగు దగ్గర డ్యాం దిగువన 14వ కిలోమీటరు వద్ద సపోర్ట్ డ్యాం (చెక్‌డ్యాంలాంటి నిర్మాణం) కట్టాలని నిర్ణయించింది. దీని నీటి నిల్వ సామర్థ్యం టీఎంసీ. దీని ద్వారా సాగర్‌లో నీటిమట్టం పడిపోయినా 14 కిలోమీటర్ల వరకు నీటి లభ్యత అంటే టీఎంసీ నీరు అందుబాటులో ఉంటుంది. దీంతో రివర్స్ పంపింగ్ చేయవచ్చు. రివర్స్ పంపింగ్‌కు వెసులుబాటు ఉంటుంది. జల విద్యుదుత్పాదనలో భాగంగా నాన్ పీక్ అవర్స్‌లో బహిరంగ మార్కెట్లో కరెంటు రేటు తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో యూనిట్‌కు దాదాపు రూ.4-5 వరకు కరెంటు దొరికినపుడు ఈ డ్యాంలోని నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా డ్యాంలోకి ఎత్తిపోస్తారు. పీక్ అవర్స్‌లో డ్యాం నుంచి జల విద్యుత్తు కేంద్రంలో అదే టీఎంసీ నీటితో కరెంటు ఉత్పత్తి చేసి దిగువకు వదులుతారు. దిగువ నుంచి ఎగువకు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు 6.6 మిలియన్ యూనిట్ల కరెంటు ఖర్చయితే.. అదే టీఎంసీ నీటిని డ్యాం నుంచి దిగువకు వదిలే సమయంలో 5.5 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు. పీక్.. నాన్ పీక్ అవర్స్ ప్రామాణికంగా ఈ ప్రక్రియలు చేపడుతున్నందున కరెంటు ఉత్పత్తిలో ఇదో కీలక ప్రాజెక్టుగా అధికారులు అభివర్ణిస్తున్నారు. కానీ ఇలాంటి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం గంగపాలు చేసింది. దీంతో ఇప్పుడు నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 530 అడుగుల కంటే తక్కువగా ఉండటంతో రివర్స్ పంపింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. తిరిగి సాగర్‌కు ఇన్‌ఫ్లో వచ్చే వరకు రివర్స్ పంపింగ్ అనేది జరగదు.చివరి దశలోనే నీటి పాలు2004లో శ్రీశైలం డ్యాం నుంచి 14 కిలోమీటర్ల దూరంలో సాగర్‌కు నీళ్లు వెళ్లే చోట సుమారు రూ.130 కోట్లతో నిర్మాణ పనులకు నాటి కాంగ్రెస్ సర్కారు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలిచింది. శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రం నిర్మాణ పనులు చేపట్టిన పటేల్ కంపెనీనే రూ.100 కోట్లకు టెండర్ దక్కించుకున్నది. నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 512 మీటర్ల పొడవు.. 170 మీటర్ల ఎత్తుతో టెయిల్ పాండ్ నిర్మాణం చేపట్టారు. రెండేండ్ల పాటు దాదాపు 65 మీటర్ల ఎత్తు నిర్మాణం పూర్తయ్యే వరకు అటవీ శాఖ పర్యావరణ అనుమతులు లేవన్న అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో 2006-2009 వరకు పనులు నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టు సంస్థ చేసిన పనులకు జెన్‌కో నుంచి రూ.36 కోట్లు చెల్లించారు. 2010లో అటవీ శాఖ ఇబ్బందులతో అసంపూర్తిగా చేసిన పనులను వదిలేసిన పటేల్ కంపెనీ కాంట్రాక్టును రద్దు చేసుకున్నది. తర్వాత మిగిలిన పనులు పూర్తి చేసేందుకు 2010లో హైదరాబాద్‌కు చెందిన బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు ప్రారంభించింది. 512 మీటర్ల పొడవులో ఉన్న టెయిల్ పాండ్ ఎడమ వైపు 170 మీటర్ల ఎత్తు వరకు ఉంటే 35 మీటర్ల వరకు పనులు పూర్తి చేసింది. మిగితా 164.7 మీటర్ల ఎత్తుకు కాంక్రీట్ పనులు జరిగే సమయంలో 2015 నవంబర్ 19న శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో అన్ని యూనిట్లలో విద్యుదుత్పత్తి చేసి దాదాపు 40 వేల క్యూసెక్కులు విడుదల చేయడంతో చివరి దశ నిర్మాణ పనుల్లో ఉన్న సపోర్ట్ డ్యాంకు గండి పడింది.నాసిరకం పనులే కారణండ్యాంకు గండిపడినప్పుడు స్థానికులు కూడా పెద్ద ఎత్తున నిరసన తెలిపి, అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వాస్తవానికి ఈ సపోర్ట్ డ్యాంను కాంక్రీట్‌తో నిర్మించాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు అందుకు భిన్నంగా నదిలోనే దొరికే రాళ్లను పేర్చి నిర్మించారని, ఇందులో భాగంగా సున్నపురాళ్లను కూడా పెట్టి నిర్మాణం చేపట్టారని విచారణలో తేలింది. దీని కారణంగానే 40 వేల క్యూసెక్కుల వరదకే డ్యాంకు గండిపడింది. కాగా డ్యాంను పునరుద్ధరించేందుకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలిసింది. ఇందులో భాగంగా ఎస్సెల్బీసీ సొరంగం కుప్పకూలిన సమయంలో అక్కడికి వచ్చిన ఐఐటీ బృందంతో కలిసి ఈ డ్యాంను కూడా పరిశీలించారు. నాసిరకంగా నిర్మించిన ఈ సపోర్ట్ డ్యాంను పునరుద్ధరించినా ఫలితం ఉండదని, కొత్తగా నిర్మించాల్సిందేనని సదరు బృందం తేల్చి చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో నిర్మాణానికి వెచ్చించిన రూ.వంద కోట్లు కృష్ణార్పణమేనని స్పష్టమవుతున్నది. అయితే ఒక చిన్న చెక్‌డ్యాం లాంటి నిర్మాణాన్ని పటిష్టంగా కట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక రంధ్రాన్వేషణ చేస్తున్నదన్న చర్చ నడుస్తున్నది.

## అమ్మ మాట -అంగన్వాడి బాట



చిలుకూరు (ప్రభాత సూర్యుడు): మండలంలోని చేన్నారి గూడెం గ్రామంలో ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి నిర్వాహకులు అమ్మ మాట -అంగన్వాడి బాట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా గ్రామంలో ర్యాలీనీ గ్రామపంచాయతీ కార్యదర్శి వెలిశాల శౌరిక ప్రారంభించి మాట్లాడారు.0.5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీలకు ,బాలింతలకు చిన్నారులకు పౌష్టిక ఆహారంతో పాటు పోషక విలువలు కలిగిన పదార్థాలను అందజేస్తారని తెలిపారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించి వారు పాఠశాలకు వెళ్లేలా ప్రోత్సాహాన్ని




అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఎడవల్లి నాగలక్ష్మి, అంగన్వాడి ఆయమ్మ కాంపాటి వెంకటరమణ, గ్రామపంచాయతీ సిబ్బంది బిల్ కలెక్టర్ పుట్టపాక నాగేశ్వరరావు,సూరపల్లి పరుశన్, గ్రామ పెద్దలు, మాజీ వార్డ్ నెంబర్ వీరమ్మ, ఆశ వర్కర్ కొండమీది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

### ఏటూరు నాగారం యూత్ మండల అధ్యక్షుడు గద్దల నవీన్



ఏటూరు నాగారం (ప్రభాత సూర్యుడు): ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో ఎటునాగారం యూత్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గద్దల నవీన్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నమెంట్ పాఠశాల అభివృద్ధికి కట్టుబడింది అన్నారు. ప్రభుత్వ స్కూల్లో బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు చేయాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ 2025 సంవత్సరం గాను ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట తో విద్యార్థుల పాఠశాలలో చేరాలని పేదరికం యొక్క స్థితిగతులు మారుతాయి అని విద్య అనేది జ్ఞానమార్గం ఇది మానవ జీవితాన్ని శక్తివంతమైన సాధనం యుద్ధాల తిరు అలవాట్లు దూరంగా ఉండాలని పాఠశాల మరియు గ్రామ అభివృద్ధికి అన్నివేళలా సహకారాలు ఉంటాయని పాఠశాల మరియు గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారాలు ఉంటాయని సమస్య ఉంటే మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తారని తెలిపారు.

## హయత్ నగర్ లోని రవీంద్ర భారతి స్కూల్ సీజ్




హయత్ నగర్ - ప్రభాత సూర్యుడు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న హయత్ నగర్ లోని రవీంద్ర భారతి పాఠశాలను విద్యాశాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు. జిహెచ్ఎంసి నుండి అనుమతులు లేకుండా, విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా స్మశానం పక్కనే నడిపిస్తున్నారని రవీంద్ర భారతి స్కూల్ పై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు శివ కుమార్, ఎర్ర శ్రీహరి గౌడ్ లు ఆరోపణలు చేసిన నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేశారు. విద్యా ప్రమాణాలు పాటించకుండా, అక్రమంగా పాఠశాలను నడిపిస్తున్నట్లు తేలడంతో బుధవారం స్కూలును సీజ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం స్పోక్స్ పర్సన్ వి.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



## ఎంపీ ఓ కు గ్రామపంచాయతీ ట్రాక్టర్ల తాళాలు అప్పగింత




చిలుకూరు (ప్రభాత సూర్యుడు): చిలుకూరు మండలం పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ ట్రాక్టర్ల తాళాలను ఎంపీ ఓ నరసింహారావుకు అప్పగించారు. డీజిల్ బిల్లులు, నిర్వహణ ఖర్చులు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిర్వహణ ఖర్చులు తాను భరించలేమన్నారు.

## 'లొంగిపోను, చచ్చిపోతా'.. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నేరస్తుడు ఏం చేశాడంటే?

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ పోలీసులకు చుక్కలు చూపించాడు. కళ్లగప్పి తిరుగుతున్న అతడ్ని అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే ఎత్తైన బిల్డింగ్ ఐదో అంతస్తు ఎడ్జ్‌కు చేరుకున్నాడు. 'లొంగిపోను, చచ్చిపోతా' అని బెదిరించాడు. అహ్మదాబాద్: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ పోలీసులకు చుక్కలు చూపించాడు. కళ్లగప్పి తిరుగుతున్న అతడ్ని అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే ఎత్తైన బిల్డింగ్ ఐదో అంతస్తు ఎడ్జ్‌కు చేరుకున్నాడు. 'లొంగిపోను, చచ్చిపోతా' అని బెదిరించాడు.చివరకు ఫైర్ సిబ్బంది సహాయంతో ఆ నేరస్తుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. పలు కేసుల్లో వాంటెడ్ క్రిమినల్ అయిన అభిషేక్ అలియాస్ 'షూటర్' చాలా కాలంగా అరెస్టు నుంచి తప్పించుకున్నాడు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అతడి కోసం వెతుకుతున్నారు.కాగా, శివమ్ ఆవాస్‌లోని అపార్ట్‌మెంట్‌లో అభిషేక్ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శనివారం క్రైమ్ బ్రాంచ్ బృందం అక్కడకు చేరుకున్నది. పోలీసులను చూసిన అభిషేక్ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. బిల్డింగ్ ఐదో అంతస్తులోని గట్టుపైకి చేరుకున్నాడు. 'నాతో ఎలా ప్రవర్తిస్తారో నాకు తెలుసు. అది నిజంగా దారుణంగా ఉంటుంది. లొంగిపోవడం కంటే చనిపోవడం మేలు. కిందకు దూకేస్తా ' అని బెదిరించాడు. పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ అక్కడి నుంచి పైకి రాలేదు. తన మొబైల్‌లో లైవ్ స్ట్రీమింగ్ చేశాడు.మరోవైపు స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడ గుమిగూడారు. చివరకు పోలీసులు ఫైర్ సిబ్బందిని రప్పించారు. వలల సహాయంతో అభిషేక్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుమారు మూడు గంటలపాటు సాగిన ఈ హైడ్రామాకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ప్రాణాలు తీస్తున్న డస్టింగ్ ఛాలెంజ్.. అమెరికాలో 19 ఏళ్ల యువతి మృతి



'డస్టింగ్ ఛాలెంజ్ అనే మరో సోషల్ మీడియా ట్రెండ్ యువతతోపాటు మైనర్ బాలబాలికల ప్రాణాలు తీస్తోంది. సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం పలువురు ఈ 'డస్టింగ్ ఛాలెంజ్ ట్రెండ్'ను ఫాలో అవుతున్నారు. 'డస్టింగ్ ఛాలెంజ్ అనే మరో సోషల్ మీడియా ట్రెండ్ యువతతోపాటు మైనర్ బాలబాలికల ప్రాణాలు తీస్తోంది. సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం పలువురు ఈ 'డస్టింగ్ ఛాలెంజ్ ట్రెండ్'ను ఫాలో అవుతున్నారు. ఈ ట్రెండ్‌ను ఫాలో అయ్యి తాజాగా అమెరికాలో 19 ఏళ్ల యువతి ప్రాణాలు కోల్పోయింది.డస్టింగ్ ఛాలెంజ్‌లో భాగంగా 19 ఏళ్ల యువతి రెన్నా ఓ రూర్కీ తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి ఎరోసాల్ కీ బోర్డు క్లీనర్‌ను ఆర్డర్ చేసింది. ఆ తర్వాత ఆ కీబోర్డు క్లీనర్ వాసన పీల్చి రూర్కీ కార్డియాక్ అరెస్ట్‌కు గురైంది. పేరెంట్స్ ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా నాలుగు రోజుల నుంచి ఐసీయూలో చికిత్స పొంది ప్రాణాలు కోల్పోయింది.తన కుమార్తె ఎప్పుడూ తాను 'ఫేమస్ కాబోతున్నాను, ఫేస్ కాబోతున్నాను' అని చెప్పేదని, కానీ ఇలా జరుగుతుందని అస్సలు అనుకోలేదని రూర్కీ పేరెంట్స్ విలపించారు. కాగా డస్టింగ్ అనే సోషల్ మీడియా ట్రెండ్‌కే 'క్రోమింగ్', 'హఫింగ్' అనే పేర్లు కూడా ఉన్నాయి. ఈ సోషల్ మీడియా ట్రెండ్ ఇప్పుడు వైరల్ ట్రెండ్‌గా మారింది. వ్యూస్ కోసం.. ఇళ్లలో వినియోగించే క్లీనర్స్ వాసన పీల్చడమే ఈ డస్టింగ్ ఛాలెంజ్.అయితే ఈ ఛాలెంజ్‌లో భాగంగా రూర్కీ.. ప్రమాదకరమని తెలియక ఎరోసాల్ కీబోర్డు క్లీనర్ వాసన పీల్చింది. దాంతో కార్డియాక్ అరెస్ట్‌కు గురై ప్రాణాలు పోగొట్టుకుంది. ఈ ట్రెండ్ ఇతర దేశాల కంటే అమెరికాలోనే బాగా ప్రాచుర్యంలో ఉంది.

## కుల గణనపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలి



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కులగణన జరపడానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోడీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం (మే 5) మోడీకి లేఖ రాశారు. దేశంలో మొట్టమొదటిసారిగా కులగణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలంగాణ కులగణన నమూనాను అనుసరించాలని ఖర్గే లేఖలో మోడీ ప్రభుత్వాన్ని కోరారు. తుది కుల గణన నివేదికలో ఏదీ దాచిపెట్టవద్దని.. ప్రతి కులం యొక్క సామాజిక, ఆర్థిక డేటాను ప్రజలకు చేరువలో ఉంచాలి అని ఆయన మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రిజర్వేషన్లకు సంబంధించిన విషయంపై కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఆగస్టు 1994 నుండి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో తమిళనాడు రిజర్వేషన్ల చట్టం మాత్రమే రక్షించబడింది. అదే మాదిరిగా.. ఇతర రాష్ట్రాల చట్టాలను కూడా మన రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలి అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని కూడా రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించేందుకు కులగణన సర్వే ద్వారా స్పష్టమవుతుందని ఆయన లేఖలో తెలిపారు. ఈ కులగణన సర్వే ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15(5)ను అమలు చేయాల్సిన అవసరం నెలకొంటుంది అని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఉన్నత విద్యా శాఖకు గ్రాంట్ల డిమాండ్లపై మార్చి 25, 2025న సమర్పించిన 364వ నివేదికలో విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆర్టికల్ 15(5)ని అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసిందని ఖర్గే పేర్కొన్నారు. సామాజిక న్యాయం అనే అంశాన్ని లేవనెత్తినందుకు ప్రధాని మోడీ, ఆయన సహచరులు కాంగ్రెస్‌పై దాడి చేశారు. అయినప్పటికీ మన రాజ్యాంగ ప్రవేశికలో ప్రతిజ్ఞ చేసినట్లుగా ఆర్థిక న్యాయం, హోదా, అవకాశాల సమానత్వాన్ని నిర్ధారించడానికి కులగణన ఖచ్చితంగా అవసరం అని ఖర్గే నొక్కి చెప్పారు. మన సమాజంలో వెనుకబడిన అణగారిన వర్గాలకు వారి హక్కులను అందించే కులగణన వంటి ప్రక్రియను నిర్వహించడం ఏవిధంగానూ విభజనగా పరిగణించకూడదు అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు.

## 'నీ ఆదాయం పెరిగింది.. తెలంగాణ ఆదాయం ఎందుకు పెరగలేదు'





**హైదరాబాద్, :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాల పోటీలకు రూ.250 కోట్లు పెట్టడానికి డబ్బులు ఉన్నాయి కానీ.. రిటైర్ అయిన ఉద్యోగులకు ఇవ్వడానికి డబ్బులు లేవా? అని మండిపడ్డారు. నిన్ను కోసుకొని తినడం కాదు.. నువ్వే రాష్ట్రాన్ని పీక్కొని తింటున్నావ్ సర్కార్ నడుపుతున్నావా? సర్కస్ నడుపుతున్నావా? అంటూ రేవంత్ రెడ్డిపై ఫైరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అసలు, వడ్డీ కలిపి నెలకు చెల్లించే అప్పు కేవలం రూ.2000 కోట్లు మాత్రమేనని, ఇది కాగ్ లెక్క..మీ లాగా కాకి లెక్క కాదన్నారు. చెప్పులు ఎత్తుకపోవడానికి వేరే పార్టీ వాళ్ళు రెడీగా ఉన్నారని.. ఢిల్లీకి మూటలు మోయడానికి పోతే దొంగ లెక్కనే చూస్తారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి స్పెషల్ ఫ్లైట్స్, లగ్జరీ ప్రయాణాలు అన్ని ప్రజలు చూస్తున్నారని.. ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నానని సిఎం అంటున్నారని, దమ్ముంటే 43 సార్లు వెళ్లిన ఢిల్లీ ప్రయాణాల ఖర్చు మీద శ్వేతపత్రం విడుదల చెయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. "ఫోర్త్ సిటీలో 2000 ఎకరాలు ఎట్లా కొన్నావు?. నీ అన్నదమ్ములు, నీ బామ్మర్ది, నీ కుటుంబ సభ్యులు అందరి ఆదాయం పెంచుకున్నావు. కానీ రాష్ట్ర ఆదాయం ఎందుకు పెరగలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి లీటర్ రూ.200 చేసి సంపద పెంచాలని అనుకుంటున్నాడు, ధరలు పెంచడం కాదు.. బుర్ర పెంచు.. సంపద పెంచే ఆలోచన చేయి" అని సిఎం రేవంత్ పై కెటిఆర్ ధ్వజమెత్తారు.

## సోలార్ విద్యుత్ మాకు కుదించకండి.. కేంద్రమంత్రితో భట్టి



ఢిల్లీ : కేంద్రమంత్రి ప్రహ్లాద జోషితో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బేటీ అయ్యారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి గురించి వారిద్దరు చర్చించారు. తెలంగాణలో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టింది. ముఖ్యంగా, మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా రాష్ట్రం పెట్టుకుంది. సోలార్ పవర్ విషయంలో కేంద్ర ?ప్రభుత్వం కూడా నూతన పాలసీ తీసుకురావడంతో దానిపై తెలంగాణ ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల ద్వారా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి సాధించేందుకు గాను వారికి పెద్ద ఎత్తున సోలార్ పంపులను పెట్టించాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు భట్టి మిక్రమార్క చెప్పారు. అయితే, కేంద్రం 4 వేల మెగావాట్ల నుంచి వెయ్యి మెగావాట్ల వరకు కుదించినట్లు తమకు సమాచారం అందిందని చెప్పారు. ఈ విషయంపైనే కేంద్రమంత్రి ప్రహ్లాద జోషితో చర్చించినట్లు భట్టి తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ముందుగా ప్రకటించిన 4 వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందం కొనసాగేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటికే మహిళా స్వయం సహాయక బృందాలతో 1000 మెగా వాట్ల విద్యుత్ కోసం ఎమ్ఓయూ ద్వారా ఒప్పందం చేసుకున్నామని ఆయన గుర్తుచేశారు.

## టీటీడీ ట్రస్ట్ బోర్డ్-అత్యవసర-భేటీ



**అమరావతి,:** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం నాడు 65,095 మంది భక్తులు శ్రీవారి దర్శించుకున్నారు. వారిలో 26,912 మంది తలనీలాలు సమర్పించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ఒక్కరోజే హుండీ ద్వారా 3.78 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏడు కంపార్ట్‌మెంట్లల్లో భక్తులు వేచివున్నారు. టోకెన్ లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి 6 నుంచి 8 గంటల సమయం పట్టింది. కంపార్ట్‌మెంట్లు, క్యూ లైన్లల్లో ఉన్న వారికి టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు అల్పాహారం, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. కాగా- టీటీడీ పాలక మండలి అత్యవసరంగా సమావేశం కాబోతోంది. బుధవారం ఉదయం 11 గంటలకు భేటీ కానుంది. తిరుమలలోని అన్నమయ్య భవన్ పాలక మండలి కార్యాలయం దీనికి వేదిక. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దీనికి అధ్యక్షత వహించనున్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్ దీనికి హాజరు కానున్నారు. టీటీడీ కార్యనిర్వహణాధికారి జే శ్యామలరావు, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, జేఈఓ వీరబ్రహ్మం పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పాలక మండలి పలు నిర్ణయాలను తీసుకోనున్నట్లు తెలుస్తోంది. తిరుమలలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించడం, శ్రీవారి లడ్డూ, అన్నప్రసాదంలో నాణ్యతపై సమీక్షించనుంది. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఫీడ్ బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను ఇటీవలే ప్రవేశపెట్టింది టీటీడీ. దీనిపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంది. అలాగే- టీటీడీ ఆలయాలు, ఆస్తుల గ్లోబల్ ఎక్స్‌పాన్షన్ కోసం అవసరమైన సూచనల కోసం నిపుణులతో కమిటీ ఏర్పాటుకు గత పాలక మండలి ఆమోదం తెలిపింది. ఈ కమిటీ ఇచ్చే రిపోర్టుపై తాజా సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం. దేశంలోని ప్రముఖ ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాలు నిర్మించేందుకు కమిటీ ఏర్పాటుపై చర్చిస్తుంది. కాలినడకదారుల్లో తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించడానికి అవసరమైన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకంపై తుది నిర్ణయం తీసుకోవచ్చు.

# కుక్కకాటుకు 'చావు' దెబ్బ!



రాష్ట్రంలో వీధికుక్కల బెడద పెరుగుతున్నది. ఏ మూలనుంచి ఏ కుక్క వచ్చి దాడిచేస్తుందో తెలియని దుస్థితి నెలకొన్నది. చిన్నారులు ఇంటిముందు ఆడుకుంటున్నా తల్లిదండ్రులు వారిని ఒంటరిగా వదల్లేని పరిస్థితి ఉన్నది. హైదరాబాద్ మహానగరంలోనైతే ఈ సమస్య మరింత జటిలంగా మారింది. పౌరుల రక్షణకు చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యంగానే కనిపిస్తున్నది. ఎందుకంటే ఈ నాలుగు నెలల్లోనే పదివేల మందికి పైగా కుక్కకాటుకు గురై బాధితులు చికిత్స తీసుకుంటున్నట్టు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) లెక్కల్ని చూస్తే అర్థమవుతున్నది. సాధారణంగా నారాయణగూడలోని ఐపీఎంకు నెలకు రెండు వేల నుంచి రెండువేల ఐదువందల మధ్య ఓపి ఉంటుంది. కానీ ఏప్రిల్, మే నెలల్లో అది కాస్తా మూడు వేలకు చేరువ కావడం ఆందోళన కలిగిస్తున్నది. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలతో నీరు దొరక్క పోవడం, రహదారులపై వేసే చెత్త, దుర్గంధంతో కుక్కలు అక్కడే గుమిగూడటం, ఆహారం దొరక్క ఆగ్రహంతో అటువైపుగా వెళ్లేవారిపై దాడిచేసి గాయపరచడం తరచూ జరుగుతున్నవి. ఇది జీహెచ్ఎంసీ నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నది. ఇటీవల వెల్లడయిన ఒక సర్వే ప్రకారం చూస్తే ప్రపంచవ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో ముప్పై ఆరుశాతం మనదేశం నుంచే ఉండటం ఆందోళన కలిగించే అంశం. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్నాటక తర్వాత తెలంగాణలోనే ఈ కేసులు నమోదవుతున్నట్టు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సమాచారం. యాంటి రేబిస్ టీకాలు పీహెచ్‌సీలతో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాల్సి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా దీనిపై ఒక స్పష్టత లేదు. రేబిస్ నిరోధక టీకాల కొనుగోలు, సరఫరా అంతా ఒక మిథ్యగానే ఉంది. కోట్లాది రూపాయలు వ్యయం చేసి కొంటున్నామని చెబుతున్నప్పటికీ మందులు మాత్రం అందుబాటులో లేవన్నది సత్యం! ఎందుకంటే, అధికారిక లెక్కల ప్రకారమే కుక్కకాటుతో దాదాపు యేటా యాభైవేల మంది ఆస్పత్రుల పాలవుతున్నారంటే టీకాల కొరత దానికి సాక్ష్యం. యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్-2001 ప్రకారం వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయాలి.కానీ వీటి నియంత్రణకు నిధుల కొరత చాలా రాష్ట్రాలను వెంటాడుతున్నది. కేంద్రమైనా పట్టించుకుంటుందంటే అదీ లేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3.8లక్షల శునకాలున్నట్టు 2023లో హైకోర్టుకు ఇచ్చిన గణాంకాల్ని బట్టి తెలుస్తున్నది.7.21లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించినట్టు కార్పొరేషన్ తెలిపింది. మేయర్ మాత్రం 5.75లక్షల కుక్కల్ని గుర్తించినట్టు పేర్కొంది. పొంతన లేని సమాధానాలే అనేక ప్రశ్నలకు ఆస్కారమిస్తున్నాయి. వాస్తవానికి దీనికి రెట్టింపు కుక్కలు నగరవాసుల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి! సుమారు వందమంది నిత్యం ఏదో ఓచోట ఈ కుక్కల బారిన పడి గాయాలపాలు కావాల్సి వస్తున్నది. రెండేండ్ల కిందట అంబర్‌పేటలో జరిగిన కుక్కల దాడిలో నాలుగేండ్ల చిన్నారి మృతి ఘటనను సుమోటాగా తీసుకున్న హైకోర్టు కుక్కల జనాభా నియంత్రణ, పౌరుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని జీహెచ్ఎంసీని ఆదేశించింది. అప్పటికి దీనిపై ఒక ప్రణాళిక గానీ, ముందస్తు కసరత్తు లాంటివి అధికార యంత్రాంగం చేయలేదు. దీంతో నెలల వ్యవధిలోనే మరో ఎనిమిది ఘటనలు చోటుచేసుకున్నాయి. మళ్లీ హైకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప సర్కార్‌లో కదలిక రాలేదు. 'రాష్ట్రంలో వీధికుక్కల బెడదను నిర్మూలిస్తామని, చిన్నారుల మరణాలు మరెక్కడా సంభవించకుండా చర్యలు తీసుకుంటామని' ముఖ్యమంత్రి చెప్పారు. కానీ, ఈ రెండేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా పదిహేను నుంచి ఇరవైమంది చిన్నారులు కుక్కలదాడిలో బలయ్యారు? వరుస ఘటనల నేపథ్యంలో ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆక్రోశంతో బ్లూక్రాస్ అనే సంస్థతో ఒప్పందం చేసుకున్న జీహెచ్ఎంసీ కొన్నిరోజులు హడావిడి చేసింది. కానీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. భారత జంతు సంక్షేమ బోర్డు నియమాల ప్రకారం జంతువులకు స్టెరిలైజేషన్ చేసి, యాంటీ-రేబిస్ టీకాలు వేసి, కోలుకున్న తర్వాత, వాటిని పట్టుకున్న అదే ప్రాంతంలో వదిలేయాలి. కానీ ఆదిశగా అడుగులు వేయడంలో సర్కారు నిర్లక్ష్యం కనిపిస్తున్నది. గ్రామాల్లోనూ కుక్కల స్వైర విహారానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. గొర్రెల మందలపై విచ్చలవిడిగా దాడులు చేయడంతో పలుచోట్ల మృత్యువాత పడుతూ కాపరులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నవి. ఇప్పటికైనా ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి వీధికుక్కల బెడదను తగ్గించేందుకు కారణాల్ని విశ్లేషించాలి. చిన్నారుల మరణాలను అరికట్టాలి. లేదంటే 'కుక్కకాటుకు చెప్పుదెబ్బ' అన్న నానుడి సర్కార్‌కు కూడా వర్తిస్తుంది.

# అస్పష్ట అమరావతి



విభజనకు గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదకొండేళ్ల తర్వాత కూడా రాజధాని రూపు రేఖలపై అస్పష్టత వీడకపోవడం ఏలికలు సృష్టించిన ఉత్పాతం.టిడిపి కూటమి ప్రభుత్వం శుక్రవారం పెద్ద హైప్ ఇచ్చి ప్రధాని మోడీతో రాజధాని అమరావతి పున:ప్రారంభ మహోత్సవం నిర్వహించాక కూడా అయోమయం అలాగే ఉంది. రూ.49 వేల కోట్ల విలువైన అమరావతి పునర్నిర్మాణ 74 ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపనలు చేశారు. రాజధాని నిర్మాణం స్వాగతించదగినది. ప్రధాని అమరావతికి ప్రాణప్రతిష్ట చేస్తున్నారంటే ఎంత ఆర్థిక సాయం చేస్తారన్న ఉత్సుకత ప్రజల్లో ఉంటుంది. కానీ ప్రధాని మాటలతో సరి పెట్టి అందరినీ తీవ్ర నిరాశకు గురి చేశారు. 2015 అక్టోబర్ 22 దసరా రోజున అమరావతికి తొలుత శంకుస్థాపన చేసిన మోడీ గుప్పెడు మట్టి చెంబుడు నీళ్లు తెచ్చి అదే కొండంత సాయమనుకోమన్నారు. దశాబ్దం గ్యాప్ తీసుకొని ఒట్టి మాటలు వల్లించడం మ్యోడీకే చెల్లింది. అప్పుడు ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మోడీ సాయానికి ఉబ్బితబ్బివ్వడం రాష్ట్ర ప్రజలకు ఎదురైన ఒకానొక విచిత్ర అనుభవం! పదేళ్లుగా అమరావతికి నిరంతరయంగా తాము సాయం చేస్తూనే ఉన్నామని పున:ప్రారంభ వేదికపై ప్రధాని అవాస్తవం చెప్పారు. అంతగా నిధులిస్తే ఎందుకు రాజధాని పూర్తి కాలేదన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. నాడు చంద్రబాబు ప్రతిపాదిత బాహుబలి అమరావతి నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లవుతుందని అంచనాలు కట్టగా కేంద్రం తొలినాళ్లలో విదిల్చిన 1,500 కోట్లే మినహా రూపాయి రాలేదు. స్విట్జర్లాండ్, ప్రపంచబ్యాంక్ పేరిట హడావుడే తప్ప తొలి ఐదేళ్లల్లో టిడిపి సర్కారు తాత్కాలిక భవనాలకే పరిమితమైంది. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల ఆట తెరమీదకి తేగా ప్రధానిగా ఉన్న మోడీ వారించలేదు సరికదా, రాజధానిరాష్ట్ర ప్రభుత్వం ఇష్టమని ఉన్నత న్యాయస్థానాల్లో కేంద్రం అఫిడవిట్‌లు ఇచ్చింది. అమరావతి పున:ప్రారంభ సభలోనూ జగన్‌ను మోడీ ఏమీ అనలేదు. వైసిపి సైతం ప్రధాని రాష్ట్రానికి ఏమీ చెయ్యకపోయినా, అమరావతికి నయాపైసా ప్రకటించకపోయినా నోరు మెదపలేదు. దీన్నిబట్టే కేంద్ర బిజెపికి, జగన్‌కు మధ్య సంబంధ బాంధవ్యాలేమిటో తెలిసిపోతుంది. అమరావతి '2.0' సాకారం కావాలంటే 77 వేల కోట్లు కావాలని టిడిపి కూటమి ప్రభుత్వం ఎస్టిమేట్ వేసింది. వాటిలో కేంద్రం మధ్యవర్తిగా ప్రపంచ బ్యాంక్ నుంచి ఇప్పించే అప్పు 15 వేల కోట్లు కాగా హడ్కో రుణం 11 వేల కోట్లు, జర్మనీ బ్యాంక్ కెఎఫ్‌డబ్ల్యు లోన్ ఐదు వేల కోట్లకు ఒప్పందాలు కుదిరాయంటున్నారు. అంతా కలిపితే 31 వేల కోట్లు. మిగిలిన 46 వేల కోట్లూ కేంద్రం ఇవ్వాలని రాష్ట్రం అభ్యర్థిస్తోంది. దీనిపై ప్రధాని దాట వేశారు. అమరావతి ఒక నగరం కాదు అదొక మహాశక్తి ఎపిని ఆధునికాంధ్రగా మారుస్తుంది దేశానికి మార్గదర్శనం చేస్తుంది గ్రోత్ ఇంజన్ అవుతుంది మీ భుజాలకు నా భుజం కలుపుతా కలిసిమెలిసి పని చేద్దాం.. అంటూ మాటల మాంత్రికునిలా మోడీ వ్యవహరించగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి నేతలు పారవశ్యంలో తరించారు. విభజన చట్టంలో రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదని స్పష్టంగా పేర్కొనగా, చట్టాన్ని అమలు చేయాలని, నిధులివ్వాలని అడిగే ధైర్యం చంద్రబాబుకు, కూటమి నేతలకు లేకపోయింది. అప్పులు సమీకరించుకోడానికి సహకరిస్తామని మాత్రమే కేంద్రం చెపుతోంది. అప్పులతో కేపిటల్‌ను కడితే ప్రజలపై భారాలు తథ్యం. రాష్ట్రాన్ని ఇంతగా దగా చేస్తున్నా బిజెపిపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అపార ప్రేమ వాత్సల్యాలు కురిపించడం నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచడమే. రాజధానికి 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతులు అమరావతే రాజధానిగా చట్టబద్ధత కోరుతున్నారు. సిఎం ఆ మేరకు హామీ ఇచ్చారు కూడా. కానీ పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన మోడీఆ ఊసెత్తక పోవడం రైతులను వంచించడం కాదా? తీసుకున్న భూములకే దిక్కులేకపోగా ఇంకా 44 వేల ఎకరాలు దేనికో అర్థం కాదు. బాహుబలి రాజధానికి స్వస్తి పలికి అన్ని వసతులతో రాజధానికి పరిమితం కావాలన్నది నిపుణుల సూచన. విభజన చట్టం మేరకు ప్రత్యేక హోదా సహా హామీల సాధన ద్వారా ప్రణాళికాబద్ధ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్నారు. వారి ఆకాంక్షల ప్రకారం నడుచుకోడం రాష్ట్ర ప్రభుత్వ విధి.

# జ్ఞాన జ్యోతికి నెలవు



పురాతన నాగరికతల చరిత్రలో భారతదేశానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. జ్ఞానాన్వేషణ, విద్యాభ్యాసం, విశాలదృష్టిని పదిలంగా నిలిపిన నాగరికతగా ఇది ఎన్నో తలాలపై వెలుగొందింది. ఈ క్రమంలో తక్షశిల అనే పట్టణం ఒక అద్భుత జ్ఞాన కేంద్రంగా ఎదిగింది. దాదాపు 2500 సంవత్సరాల కిందట సకల విద్యాశాఖల పుట్టినిల్లుగా గుర్తింపు పొందిన తక్షశిల విశ్వవిద్యాలయం, ముఖ్యంగా అక్కడి గ్రంథాలయం, భారతీయ విజ్ఞాన పాఠశాలల మహిమను ప్రపంచానికి చాటి చెప్పింది. ఇప్పటి పాకిస్తాన్‌లోని రావల్పిండి సమీపంలో ఉన్న తక్షశిల విశ్వవిద్యాలయం నిజంగా 'యూనివర్సిటీ' అనే పదానికి మించిన బహుళ విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇది కేవలం విద్యాబోధనే కాకుండా, జ్ఞాన మార్గంలో పరిశోధనలతో శాస్త్రీయ చింతనకు నిలయంగా నిలిచింది. ఈ నగరానికి హృదయంగా ఉన్న గ్రంథాలయం ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన శిష్యులకు ఆదర్శ విద్యా వేదికగా నిలిచింది. వైద్యం, ఖగోళశాస్త్రం, వ్యాకరణం, తత్వశాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి విభిన్న విభాగాల్లో వేలాది గ్రంథాలు, తాళపత్ర గ్రంథాల రూపంలో సేకరించి అక్కడ భద్రపరిచారు.

### హిందూ, బౌద్ధ, జైన గ్రంథాల కూడలి

ఈ గ్రంథాలయ విశిష్టత ఏకకాలంలో రెండు ప్రధాన అంశాల్లో ఉంది. జ్ఞాన పరిమాణంలోనే కాకుండా దాని వ్యాప్తిలోనూ ఉంది. చరకుని ఆయుర్వేద గ్రంథాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం, పాణినీయ శబ్దానుశాసనం, భరతముని నాట్యశాస్త్రం వంటి అనేక అపురూప గ్రంథాలన్నీ అక్కడ నిక్షిప్తమై ఉండేవి. హిందూ, బౌద్ధ, జైన గ్రంథాలు అన్నీ అక్కడ సమపాళ్లలో ప్రాధాన్యం పొందాయి. వివిధ దార్శనిక వేదికల మీద పండితుల మధ్య జరిగిన వాద ప్రతివాదాలు, చర్చలు విద్యకు జీవం పోసేవి. తక్షశిలలో గ్రంథాలయం కేవలం పుస్తకాల నిల్వ కేంద్రంగా కాక, జ్ఞాన ప్రయోగశాలగా అభివృద్ధి చెందింది.

### భారతీయ తాత్విక ప్రతిబింబం

తక్షశిల విద్యా విధానం అనేక మండలాల్లో శిష్యులకు సమగ్ర విజ్ఞానాన్ని అందించేది. వైద్య విద్యార్థులకు తత్వశాస్త్రం నేర్పించబడేది. తత్వశాస్త్ర శిష్యులు ఖగోళ విజ్ఞానం అధ్యయనం చేయాల్సి వచ్చేది. ఇలాంటి అంత:శాఖా (ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్) విద్యను అందించడం ఆనాటి నుండే ఉన్నట్లు దీని వల్ల తెలుస్తోంది. విద్యార్థులు సమగ్ర దృక్పథంతో కూడిన పౌరులుగా ఎదిగేవారు. ఇది భారతీయ తత్వాన్ని ప్రతిబింబించే విధంగా, విద్యను వ్యక్తిగత విముక్తికి, సామాజిక సేవకూ ఉపయోగించాలన్న ఆలోచనకు ఆదర్శంగా నిలిచింది. ఈ గ్రంథాలయం గొప్పతనం ఇందులోని విద్యా స్వేచ్ఛలోనూ ప్రతిఫలిస్తుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శిష్యులకు ఆర్థికంగా సహాయం అందించేది. స్థానికులు, పాలకులు. గురు-శిష్య సంబంధం ఆధారంగా అభ్యాసం జరిగేది. బ్యూరోక్రటిక్ నియమాలు లేని ఈ పద్ధతిలో స్వేచ్ఛ, స్ఫూర్తి ఉండేది. విద్యా భంగిమను శాసించే యంత్రాంగం కాక, విజ్ఞాన ద్యోతకుల చేతుల్లో విద్య అభివృద్ధి చెందింది.

### తక్షశిల దహనంతో నాగరికత అంతర్ధానం

ఐదవ శతాబ్దంలో హుణులు తక్షశిలపై దాడి చేసి లక్షల సంఖ్యలో ఉన్న గ్రంథాలను తగల పెట్టడం వల్ల కేవలం ఓ ప్రాంగణం కాదు, ఒక నాగరికతే అంతరించిపోయింది. లక్షలాది గ్రంథాలు అగ్నికి ఆహుతి కావడంతో ఆనాటి విజ్ఞానం, సంస్కృతి ఎలా ఉంటుందో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇది అలెగ్జాండ్రియా లైబ్రరీ విధ్వంసానికి సమానమైన విపత్తుగా పోల్చవచ్చు. కానీ ధ్వంసమైనా, తక్షశిల ఆత్మ, దాని విద్యా పరంపర ప్రపంచాన్ని ఇప్పటికీ చైతన్య పరుస్తూనే ఉంది. గ్రంథాలయాల ఉనికి గురించి, వాటి లక్ష్యం గురించి ఈ రోజు మనం ఆలోచించాలంటే, తక్షశిల స్ఫూర్తిగా మారుతుంది.

### జ్ఞానం సరకు కాదు.. సమాజ సంపద

ఈ కాలంలో గ్రంథాలయాలు డిజిటలైజేషన్, నిధుల కొరత, పఠన అలవాట్ల తక్కువ తనంతో బలహీనపడుతున్నప్పుడు తక్షశిల మళ్ళీ మన మనసుల ముందుకు రావాలి. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వ గదులు కాదు. అవి ఆలోచనలకు ఆలయాలు. జ్ఞానం ఉచితంగా అందించాల్సిన పవిత్ర బాధ్యతగా గ్రంథాలయాలు పని చేయాలి. జ్ఞానం అనేది వాణిజ్య వస్తువు కాదు, అది సమాజ సంపద.

### కాలాతీతమైన పురా జ్ఞాపకం

తక్షశిలను గుర్తు చేసుకోవడం అంటే గడచిన గౌరవనీయుల కాలాన్ని మాత్రమే స్మరించుకోవడం కాదు. అది భావితరాలకు మార్గదర్శనం చూపే ఒక మోడల్‌ను తిరిగి మన ముందు నిలబెట్టడం. విద్యను బంధించకుండా, పటిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో కాకుండా, స్వేచ్ఛతో కూడిన విచారణత్మక ప్రక్రియగా అభివృద్ధి చేయాలంటే తక్షశిల భావనను మన హృదయాల్లో ప్రతిష్టించుకోవాలి. తక్షశిల గ్రంథాలయం కేవలం తాళపత్రాల నిలయం కాదు. అది ఒక జ్ఞాన భాండాగారం. దాని జ్ఞాపకమే మానవతా ప్రగతికి దీపశిఖగా మారాలి.

ప్రభాత సూర్యుడు

సంపాదకీయం

# ఉమ్మడి చితిపేర్పు

## (విశ్లేషణ)

'యుద్ధం' రెండక్షరాల మాటే, 'శాంతి' కూడా అంతే! విచిత్రంగా, చావుబతుకులు రెంటినీ ఇముడ్చుకున్నవి కూడా ఆ రెండేబీ జీవన ప్రవాహానికి రెండు వైపులా కాపుకాసే తీరాలూ, మనిషిని ఇరువైపులా మోహరించిన భిన్న ధ్రువాలూ అవేబీ వాటి మధ్యనే మానవ సంచారం.లియో తొలు స్తాయ్ 'వార్ అండ్ పీస్' పేరుతో, నిర్దిష్ట స్థలకాలాల నేపథ్యంతో రచించిన ఐతిహాసిక నవలలో మార్చి మార్చి జరిగే ఆ సంచారాన్ని అత్యద్భుతంగా, ఆర్ద్రంగా కళ్ళకు కట్టిస్తాడు.యుద్ధమూ, శాంతీ మనిషితోనే పుట్టి ఉంటాయి. బహుశా మనిషి తొలి యుద్ధం సాటిమనిషితో కాదు, ప్రకృతి శక్తులతో! అది బతకడానికి మొదలైన యుద్ధంబీ మనుషులొకరి నొకరు చంపుకునే యుద్ధం ఆ తర్వాత వచ్చిందిబీ నాగరికత ముదిరినకొద్దీ అది మహాయుద్ధాల స్థాయికి చేరింది.శాంతి అన్నది యుద్ధమనే రెండు క్రూర సింహాల మధ్య ఇరుక్కున్న బెదురుచూపుల లేడికూనా, మండు టెడారిలో అక్కడక్కడ మరులుగొలిపే శీతలజలచ్ఛాయా అయింది. మనిషి ఒంటిగా ఉన్నప్పుడు బతకనిచ్చే, బతుకునిచ్చే శాంతినే కోరుకుంటాడుబీ పదిమందిలో ఒకడైనప్పుడే యుద్ధపిపాసి అవుతాడు. ఈ చంచలత్వం మనిషి స్వభావంలోనే ఉంది.తన శాంతి యుత అస్తిత్వానికే చేటు వచ్చినప్పుడు చావో, రేవో తేల్చుకోవాలనుకోవడం సహేతుకమేబీ కానీ ఏదో ఒక విస్తరణ దాహంతో రక్తపుటేరులు పారించడంలోనే ఎక్కువ చరిత్ర మూటగట్టుకున్నాడు. తన లక్షల సంవత్సరాల మనుగడలో శాంతియుత సహజీవనంపై ఇంతవరకు ఏకీభావానికి రాలేక పోయాడు. అతని అనేకానేక విజయాలను నిలువునా వెక్కిరించే మహా వైఫల్యం అదే. ప్రకృతి ప్రణాళికలో లేని బలవంతపు చావును కొని తెచ్చుకునే వికటించిన తెలివి మనిషిది.ప్రపంచ సాహిత్యంలోని అనేక శిఖరాయమాన రచనల్లో యుద్ధమే ఇతివృత్తం. దేశ కాలాలు, భాషా సంస్కృతులు వేరైనా అవి ఒక్కలానే యుద్ధభాష మాట్లాడాయి, యుద్ధ సంస్కృతిని చిత్రించాయిబీ యుద్ధం తెచ్చిపెట్టే అపార విధ్వంసంపై, సృష్టించే దుఃఖసముద్రాలపై ఒక్క గుండెతోనే స్పందించాయి. యుద్ధాలను గర్హించే పాత్రలకూ, ఆకాశానికెత్తే పాత్రలకూ కూడా ఒకే గౌరవాన్ని కట్టబెట్టాయి. యుద్ధాలు తగవంటూనే పోరాడి ప్రాణాలు బలిపెట్టిన వీరులకు హారతి పట్టాయి.మహాభారతాన్నే తీసుకుంటే, యుద్ధం వద్దన్నవారు కూడా యుద్ధంలోకి దిగిపోయినప్పుడు, విదురుడొక్కడే ఒంటరిగా ఒడ్డున మిగిలిపోతాడు. అంతవరకు కురుపాండవులుభయుల శ్రేయస్సునూ కోరుకున్న భీష్మ పితామహుడు యుద్ధంలో పాండవ పక్షాన్ని నిర్దాక్షిణ్యంగా నరికి పోగులుపెడతాడు. చస్తే యుద్ధంలోనే చావాలి, ఇంట్లో రోగమొచ్చి చావడం కన్నా పాపమేదీ ఉండదని ఉద్బోధిస్తాడు.అర్జునుడు తనను చంపుతానని ప్రతిజ్ఞ చేసినప్పుడు ప్రాణభయంతో వచ్చి తనను కలిసిన సైంధవునితో ఆచార్య ద్రోణుడూ అదే అంటాడుబీ 'మృత్యువుకెందుకు భయపడుతున్నావు, వెళ్ళి యుద్ధం చేయి, ఎవరూ భూమ్మీద శాశ్వతం కాదు, అందరూ పోయేవాళ్ళే' నంటాడు. 'వార్ అండ్ పీస్'లో మరియా దిమిత్రెవ్నా అనే పాత్ర, తన కొడుకులు నలుగురు సైన్యంలో ఉన్నారనీ, అయినా తనకు చింత లేదనీ, చావనేది ఇంట్లో పడుకుని ఉన్నా వస్తుందనీ సగర్వంగా అంటుంది.యుద్ధానికి ఎందుకు సిద్ధమవుతున్నావని పియర్ అనే పాత్ర తన మిత్రుడు ప్రిన్స్ ఆంద్రైని అడిగినప్పుడు, 'ఏమో, ఎందుకో నాకే తెలియదు, ఇప్పుడు జీవిస్తున్న జీవితం నాకు నచ్చడంలే'దని అతనంటాడు. హోమర్ కృతి 'ఇలియడ్'లో ట్రాయ్ రాకుమారుడు హెక్టర్, అర్జునుడిలానే యుద్ధాన్ని ద్వేషిస్తాడు, తన భార్య శత్రువుకి బానిసగా చిక్కి ఊడిగం చేసే దృశ్యాన్ని ఊహించుకుని కుంగిపోతాడు, అయినా సరే యుద్ధం చేసి అఖిలీస్ చేతిలో మరణిస్తాడు. అఖిలీస్ చంపడంలోనే వెర్రి ఆనందాన్ని అనుభ విస్తాడు, అదే ఉత్తమోత్తమ పుణ్యకార్యమనుకుంటాడు, ఆ రోజుకి యుద్ధమైపోయాక మళ్ళీ మనిషై పోతాడు. తను రథానికి కట్టి ఈడ్చుకొచ్చిన హెక్టర్ మృతదేహాన్ని యాచించడానికి అతని తండ్రి ప్రియామ్ వచ్చినప్పుడు, అతణ్ణి సగౌరవంగా ఆహ్వానించి శవాన్ని అప్పగించి పంపిస్తాడు. యుద్ధవ్యతిరేకతా, యుద్ధప్రియత్వాల మధ్యబీ మానుష, అమానుషత్వాల మధ్య మనిషి ఊగిస లాట ఆశ్చర్యం గొలుపుతుందిబీ క్షతగాత్రుడై పడున్న శత్రువీరుడు ఆంద్రైని చూసి నెపోలియన్ గుండె కరుగుతుంది. తన చేతిలో మరణించిన వాలిపై పడి తారా, రావణునిపై పడి మండోదరీ హృదయ విదారకంగా రోదిస్తున్నప్పుడు రాముడు మ్రాన్పడి ఉండిపోతాడు. ఏ యుద్ధంలోనైనా విజేతలు, పరాజితులన్న తేడా కేవలం సాంకేతికమేబీ అంతిమ విజయం మృత్యు, విధ్వంసాలదే! విజేత పక్షానికి చెందిన గర్భవతి ఉత్తర, భర్త అభిమన్యుని మరణానికి కన్నీరుమున్నీరవుతుంది. ఉప పాండవులను పోగొట్టుకున్న ద్రౌపది కడుపుకోతా, నూరుగురు కొడుకులను కోల్పోయిన గాంధారి గర్భశోకమూ ఒక్కటే అవుతాయి. నివాసాలు శ్మశానాలవుతాయి, ఊళ్ళు కాలిబూడిదవుతాయి,కొంపలు కొల్లేరవుతాయి, ఖజానాలు ఖాళీ అవుతాయి, శవాల గుట్టల మధ్య బతికున్నవాళ్లు జీవచ్ఛ వాలవుతారు. గాంధారి శోకం శాపమై యదువంశాన్ని పట్టి కుదుపుతుంది, యుద్ధం ఇంకో యుద్ధానికే బీజావాపమవుతుంది, విధ్వంసం మరో విధ్వంసానికే దారి తీయిస్తుంది. శాంతి, రెండు యుద్ధాల మధ్య విరామ చిహ్నమవుతుంది. ఎంతో ఎదిగామనుకునే ఈ రోజున కూడా యుద్ధానికీ, శాంతికీ మధ్య ద్వైదీభావాన్ని మనిషి జయించలేకపోతున్నాడుబీ ఉండి ఉండి యుద్ధోన్మాది అవుతూనే ఉన్నాడు, భేరీలు మోగిస్తున్నాడు, నినాదాలు ఎలుగెత్తుతున్నాడు! ఇందుకు ఏ ఒక్కరో బాధ్యులు కారు, ఇది సమష్టి వైఫల్యం, ఉమ్మడి చితిపేర్పు.

# ఏ క్షణమైనా పాక్‌పై దాడులు..

# ప్రధాని మోదీతో ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ అత్యవసర భేటీ..



9, 10,11. ఈ తేదీల్లో పాకిస్తాన్ మీద భారత్ దాడులు చేస్తుందా? పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత్ రంగం సిద్ధం చేస్తోందా?.. ఏ విధంగా చర్యలు ఉండబోతున్నాయ్.. అనేది ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో ఢిల్లీలో వరుసగా సాగుతున్న మీటింగ్‌లు- అంచనాలు మరింత పెంచేస్తున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ప్రధాని మోదీ.. వరుసగా ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు.. ఈ క్రమంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మంగళవారం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలిశారు. ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్.. దేశ భద్రత స్థితిగతులపై మోదీకి బ్రీఫింగ్ ఇచ్చారు. అయితే.. 48 గంటల్లో మోదీ-దోవల్ భేటీ కావడం ఇది రెండోసారి.. అయితే.. రేపు దేశవ్యాప్త మాక్‌డ్రిల్‌కి ముందు వీరిద్దరి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. నిన్న రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ప్రధానమంత్రిని కలిశారు. అంతకుముందు, వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కూడా మోదీతో సమావేశం నిర్వహించారు. నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిలతో విడివిడిగా సమావేశాలు జరిగాయి. పహల్గామ్ ఉగ్రదాడులకు పాల్పడినవారిని, వారికి మద్దతిచ్చేవారిని ఊహకందని రీతిలో శిక్షిస్తామని ప్రకటించిన ప్రధాని అందుకు అనుగుణంగా వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. దేశ భద్రతపై ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 26 మంది మరణించారు. తర్వాతిరోజు, అంటే ఏప్రిల్ 23నాడు సౌదీ టూర్‌ను మధ్యలోనే ముగించుకుని, ఢిల్లీకి వచ్చిన మోదీ, అదేరోజున అజిత్ దోవల్‌ను పిలిపించుకుని మాట్లాడారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో మోదీ-దోవల్ భేటీలు జరిగాయి. ఈ నేపథ్యంలో రేపటి దేశవ్యాప్త మాక్‌డ్రిల్ తర్వాత ఏం జరుగుతోందన్నదే ఆసక్తిగా మారింది. పహల్గామ్ దాడికి భారతదేశం ప్రతీకారం తీర్చుకునే సమయం, విధానం, స్వభావాన్ని నిర్ణయించుకోవడానికి సైన్యానికి 'పూర్తి కార్యాచరణ స్వేచ్ఛ'ను మోదీ ఇటీవల ఇగట్టి దెబ్బ' ఇవ్వాలనే దేశం దృఢ సంకల్పాన్ని ఆయనచ్చారు. 'ఉగ్రవాదానికి నొక్కి చెప్పారు. సైనిక సంసిద్ధతతో పాటు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పౌర సంసిద్ధతను పెంచుతోంది. మే 7, బుధవారం, అన్ని రాష్ట్రాలుచ, కేంద్రపాలిత ప్రాంతాలు 244 పౌర రక్షణ జిల్లాలను కలుపుకుని విస్తృతమైన మాక్ డ్రిల్‌లను నిర్వహిస్తాయి. ఈ కసరత్తులలో వైమానిక దాడి సైరన్‌లను మోగించడం, డ్రిల్‌గా ప్రజలను తరలించడం, భారత వైమానిక దళంతో కమ్యూనికేషన్ సంబంధాలను పరీక్షించడం, నియంత్రణ గదులను సమీకరించడం వంటివి ఉంటాయి.

# సాంకేతికతతో యుద్ధానికి సై



సాంకేతిక పరిజ్ఞానం అన్ని రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. అందుకు యుద్ధ భూమి ఏమీ అతీతం కాదు. శత్రువులపై యుద్ధం సాధించేందుకు, స్పష్టమైన ఫలితాల కోసం టెక్నాలజీ వాడుతున్నారు. ఇందులో భాగంగా మానవరహిత ఆయుధాలు, సైబర్ వార్ఫేర్, డ్రోన్లు, రోబోటిక్స్, అన్ మ్యాన్డ్ అడ్వాన్స్‌డ్ వెపన్స్.. వంటి చాలా పరికరాల్లో సాంకేతికతను వినియోగిస్తున్నారు. కృత్రిమమేధ వాడకం పెరుగుతున్న ఈ రోజుల్లో రణరంగంలో టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగిస్తున్నారో తెలుసుకుందాం.

ఏఐ, మెషిన్ లెర్నింగ్

యుద్ధ సమయాల్లో నిర్ణయాలు తీసుకోవడం, ప్రక్రియలను ఆటోమేట్ చేయడం, ఇంటెలిజెన్స్ విశ్లేషణను మెరుగుపరిచేందుకు కృత్రిమ మేధ సాయం తీసుకుంటున్నారు. యుద్ధరంగంలో ఇది విప్లవాత్మక మార్పులు తెస్తోంది. శత్రువుల కదలికలను అంచనా వేయడానికి లేదా వ్యూహాత్మక లక్ష్యాలను గుర్తించడానికి ఏఐ విస్తారమైన డేటాసెట్లను ప్రాసెస్ చేస్తుంది. అటానమస్ విధానం ద్వారా డ్రోన్లు, వాహనాలకు ఏఐ సామర్థ్యాలు జోడిస్తున్నారు. ఇది మానవ ప్రమేయం లేకుండా రియల్ టైమ్ డెసిషన్ మేకింగ్‌కు వీలు కల్పిస్తుంది. సైబర్ బెదిరింపులను గుర్తించి సమర్థంగా కట్టడి చేసేందుకు మెషిన్ లెర్నింగ్ తోడ్పడుతుంది. కీలకమైన మౌలిక సదుపాయాలను రక్షిస్తుంది.

మానవ రహిత వ్యవస్థలు (డ్రోన్లు, రోబోటిక్స్)

యుద్ధంలో మానవరహిత వ్యవస్థలు అనివార్యంగా పెరుగుతున్నాయి. ఇది సైనికులు ప్రాణాలు కోల్పోవడాన్ని తగ్గిస్తుంది. ఇందులో డ్రోన్లు కీలకంగా మారుతున్నాయి.

ఏరియల్ డ్రోన్లను నిఘా, దాడుల్లో కచ్చితత్వం కోసం ఉపయోగిస్తున్నారు. అమెరికా ఆర్మీకి చెందిన స్మాల్ అన్‌మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్ (ఎస్‌యూజీవీ) వంటి రోబోలు బాంబుల తొలగింపును నిర్వహిస్తున్నాయి. మానవరహిత అండర్ వాటర్ వెహికల్స్ (యూయూవీ) మైన్ డిటెక్షన్, సబ్ మెరైన్ ట్రాకింగ్ పనులు చేస్తున్నాయి.

సైబర్ వార్‌ఫేర్ టెక్నాలజీ

యుద్ధ సమయంలో కమ్యూనికేషన్లు, ఆర్థిక వ్యవస్థలు, ఇతర రక్షణ వ్యవస్థలకు అంతరాయం కలిగించేలా సైబర్ దాడులు నిర్వహించే అవకాశం ఉంది. వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సైబర్ వార్‌పేర్ డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. ఇందులో భాగంగా మాల్వేర్, హ్యాకింగ్ టూల్స్ ద్వారా ప్రభుత్వ ప్రాయోజిత వెబ్‌సైట్‌ల్లోని సమాచారం శత్రు దేశాల్లోని నెట్‌వర్క్‌లోకి వెళ్లకుండా అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. దాంతోపాటు ఏఐ ఆధారిత సైబర్ సెక్యూరిటీ ద్వారా మిలిటరీ నెట్‌వర్క్‌లను రక్షిస్తున్నారు.

అధునాతన ఆయుధాలు

ఆధునిక ఆయుధాల ద్వారా ప్రమాద పరిధి పెరుగుతుంది. రష్యాకు చెందిన కింజాల్ అనే హైపర్ సోనిక్ ఆయుధాలు లేదా చైనాకు చెందిన డీఎఫ్-జెడ్ ఎఫ్ వంటి క్షిపణులు సంప్రదాయ రక్షణ వ్యవస్థల నుంచి వెంటనే తప్పించుకుంటాయి. లేజర్లు, మైక్రోవేవ్ వ్యవస్థలు డ్రోన్లు లేదా క్షిపణులను కచ్చితత్వంతో నిలిపివేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. జీపీఎస్ గైడెడ్ బాంబులు నిర్దిష్ట లక్ష్యాన్ని చేదిస్తాయి.

### శాటిలైట్ అండ్ స్పేస్ టెక్నాలజీస్

సైనిక కార్యకలాపాలకు అంతరిక్షం కీలకమైన డొమైన్‌గా మారింది. నిఘా ఉపగ్రహాలతో రియల్ టైమ్ ఇమేజ్‌లు, ప్రత్యేకంగా సిగ్నలింగ్ సదుపాయాలను పొందుతున్నారు. దళాల కదలికల కోసం జీపీఎస్, నావిగేషన్‌ను వాడుతున్నారు. కమ్యూనికేషన్లకు అంతరాయం కలిగించే శత్రు ఉపగ్రహాలను నిలిపివేయడానికి లేదా నాశనం చేయడానికి యాంటీ శాటిలైట్ వెపన్స్ రూపొందిస్తున్నారు.

# ఈ ఏడాదిలో ఆర్‌బీఐ మరోసారి తీపికబురు

## 2025-26లో వడ్డీ రేట్లు తగ్గొచ్చు.. ఎస్‌బీఐ అధ్యయనం అంచనా




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ మొత్తం మీద 125 బేసిస్ పాయింట్ల మేర (1.25-1.5 శాతం) రేట్లను తగ్గించొచ్చని ఎస్‌బీఐ అధ్యయన నివేదిక అంచనా వేసింది. దీంతో మొత్తం మీద రేట్ల తగ్గింపు 150 బేసిస్ పాయింట్లుగా ఉంటుందని పేర్కొంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ అంచనాలకు వచ్చింది. 0.25 శాతం స్థానంలో 0.50 శాతం చొప్పున జంబో రేటు తగ్గింపు చేపడితే అది మరింత ప్రభావవంతంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం మార్చి నెలలో 3.34 శాతానికి పరిమితం కావడం తెలిసిందే. ఇది 67 నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆహార ద్రవ్యోల్బణం శాంతించడంతో 2025-26 సంవత్సరంలో సగటు సీపీఐ ద్రవ్యోల్బణం 4 శాతం లోపు ఉంటుందని ఈ నివేదిక తెలిపింది. మరీ మఖ్యంగా ప్రస్తుత త్రైమాసికంలో ఇది 3 శాతంలోపునకు దిగివస్తుందని పేర్కొంది. నామినల్ జీడీపీ (ద్రవ్యోల్బణం మినహాయించని) 9-9.5 శాతం స్థాయిలో 2025-26 సంవత్సరానికి ఉంటుందని (బడ్జెట్ అంచనా 10 శాతం) అంచనా వేసింది. తక్కువ వృద్ధి రేటు, కనిష్ట ద్రవ్యోల్బణం నేపథ్యంలో రేట్ల తగ్గింపునకు అనుకూల తరుణంగా వివరించింది. ఎస్‌బీఐ ఆర్థిక పరిశోధన విభాగం ఈ నివేదికను రూపొందించింది.



ఆగస్ట్ నాటికి 0.75 శాతం..

'మార్చిలో కనిష్ట స్థాయికి ద్రవ్యోల్బణం దిగిరావడం.. రానున్న కాలంలోనూ పరిమిత స్థాయిలోనే ఉంటుందన్న అంచనాలతో వచ్చే జూన్, ఆగస్ట్ పాలసీ సమీక్షల్లో ఆర్‌బీఐ 75 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించొచ్చు. తిరిగి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో మరో 50 బేసిస్ పాయింట్ల రేట్లను చేపట్టొచ్చు. దీంతో మొత్తం మీద 125 బేసిస్ పాయింట్ల తగ్గింపునకు అవకాశం ఉంది. ఇప్పటికే ఫిబ్రవరి సమీక్షలో 25 బేసిస్ పాయింట్లను తగ్గించడం జరిగింది' అని ఈ నివేదిక వెల్లడించింది. కాకపోతే ఒకేసారి 25 బేసిస్ పాయింట్లకు బదులు 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపును చేపట్టడం వల్ల ఎక్కువ ఫలితం ఉంటుందని భావిస్తున్నట్టు వివరించింది. ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నియంత్రిత స్థాయి అయిన 2-6 శాతం పరిధిలోనే ఉండడాన్ని గుర్తు చేసింది. ఆర్‌బీఐ ఇప్పటికే రెండు విడతల్లో 50 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా, రెపో అనుసంధానిత రుణాలపై ఈ మేరకు ప్రయోజనాన్ని బ్యాంకులు బదిలీ చేసినట్టు తెలిపింది. ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలపై రేటు తగ్గింపు ఇంకా ప్రతిఫలించాల్సి ఉందని పేర్కొంది.


# భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత.. రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు



ఢిల్లీ: భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది. పాక్ కవ్వింపు చర్యలు ఆగడం లేదు. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు కొనసాగుతున్నాయి. వరుసగా 12వ రోజు కాల్పుల విరమణ ఒప్పందం పాకిస్తాన్ ఉల్లంఘించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ జమ్మూ కశ్మీర్‌లో 8 సెక్టార్లలో పాక్ సైన్యం సోమవారం విచ్చలవిడి కాల్పులకు దిగింది. కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ, మెంధార్, నౌషేరా, సుందర్బని, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ కవ్వింపుల చర్యలకు దీటుగా బదులిచ్చినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్ర దాడులకు ప్రతి చర్యల్లో భాగంగా సింధూ జల ఒప్పందాన్ని పక్కన పెడుతూ ఏప్రిల్ 24న కేంద్రం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఆ వెంటనే నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం ఆగడాలు మొదలయ్యాయి. యుద్ధ సన్నద్ధత కోసం సరిహద్దు రాష్ట్రాలలో రేపు మాక్ డ్రిల్ చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. పంజాబ్, గుజరాత్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్, లడక్ రాష్ట్రాలకు సూచించింది. పౌరుల రక్షణ కోసం మే 7న మాక్ డ్రిల్ నిర్వహించాలని సరిహద్దు రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. శత్రువుల వైమానిక దాడి సమయంలో తమను తాము రక్షించుకునే విధానం పై పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వనుంది. ఎయిర్ రైడ్ సైరన్స్ పనితీరు పరీక్షించడం . సైరన్ ఇచ్చి ప్రజలను ఎలా అప్రమత్తం చేయాలని అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. కాగా, సరిహద్దులు దాటి భారత భూభాగంలోకి దొంగచాటుగా ప్రవేశించిన పాకిస్తాన్ జాతీయుడిని అరెస్ట్ చేసినట్లు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. అతడి నుంచి పాక్ కరెన్సీని, గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నారు.గుజ్రన్ వాలాకు చెందిన మహ్మద్ హుస్సైన్‌గా గుర్తించిన అతడు ప్రస్తుతం పంజాబ్ పోలీసుల కస్టడీలో ఉన్నాడు. పహల్గాం ఘటన అనంతరం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చు రిల్లిన వేళ ఈ పరిణామం చోటు చేసుకుంది.

## నరమేధం వెనుక ఉగ్ర సంస్థ హస్తం ఉందా ? లేదా ?

### పాక్ కు ఐ.కా.స ప్రశ్న




న్యూయార్క్ : పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన అంశాన్ని నేడు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో లేవనెత్తింది. పాకిస్థాన్ చేస్తున్న వాదనలను కొట్టివేస్తూ భద్రతా మండలి సభ్యులు కొన్ని ప్రశ్నలు వేశారు. బైసారన్‌లో జరిగిన నరమేధం వెనుక లష్కరే తోయిబా ఉగ్ర సంస్థ హస్తం ఉందా ? లేదా ? అన్న ప్రశ్న వేశారు. ఈ అంశంలో పాకిస్థాన్‌ను యూఎన్ భద్రతా మండలి సభ్యదేశాలు గట్టిగా నిలదీశాయి. పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద ఘటనను అన్ని దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఆ ఘటన పట్ల బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని యూఎన్ చెప్పింది. మతం పేరిట పర్యాటకులను టార్గెట్ చేయడాన్ని భద్రతా మండలి సభ్యులు తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ చేపడుతున్న క్షిపణి పరీక్షలను కూడా యూఎస్ సభ్య దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇలాంటి సమయంలో అణ్వాపరీక్షలు చేయడంలో ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను ఎందుకు పెంచుతున్నట్లు అని అడిగారు. పెహల్గామ్ దాడి ఘటనలోయుధ క్షిపణి  తమను నిందిస్తున్నట్లు పాకిస్థాన్ చేస్తున్న వాదలను యూఎన్ సభ్య దేశాలు కొట్టిపారేశాయి. భారత్‌తో సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలని కొన్ని దేశాలు పాకిస్థాన్‌కు సూచించాయి.

## స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్ గా ప్రారంభం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్ గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లోని మిశ్రమ సంకేతాల నడుమ తొలుత లాభాల్లో ప్రారంభమైన సూచీలు, తర్వాత స్వల్ప నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం 9 గంటల 30 నిముషాల సమయంలో సెన్సెక్స్ 67 పాయింట్ల నష్టంతో 80,729 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 19 పాయింట్ల నష్టంతో 24,442 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఐదు పైసలు తగ్గి, 84.35 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో భారతీ ఎయిర్‌టెల్, కోల్ ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఆటో, బజాజ్ ఎలక్ట్రానిక్స్ షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. సిప్లా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అపోలో హాస్పిటల్ స్టాక్స్ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి.

## 105 డ్రోన్‌లతో ఉక్రెయిన్ దాడి .. విమానాశ్రయాల్లో ఆంక్షలు



మాస్కో : రష్యా రాజధాని  మాస్కో సహా పలు ప్రాంతాలపై సోమవారం రాత్రి ఉక్రెయిన్ 100కి పైగా డ్రోన్‌లతో విరుచుకుపడిందని అధికారులు మంగళవారం ప్రకటించారు. ఉక్రెయిన్ దాడులతో రష్యాలోని పలు విమానాశ్రయాల్లో రాకపోకలను పరిమితం చేసినట్లు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి 105కి పైగా డ్రోన్‌లు రష్యాను లక్ష్యంగా చేసుకున్నాయని రక్షణ శాఖ ప్రకటించింది. మే 9న నిర్వహించనున్న రెండవ ప్రపంచ యుద్ధం విక్టరీ డే పరేడ్‌కు కొన్ని రోజుల ముందు ఈ దాడులు చోటుచేసుకున్నాయి. 80వ వార్షికోత్సవ వేడుకలకు రష్యా అధ్యక్షులు పుతిన్ సహా పలువురు ప్రపంచ నేతలు హాజరుకానున్నట్లు తెలిపింది. మాస్కోపై దూసుకువచ్చిన 19 డ్రోన్‌లను వైమానిక రక్షణ దళాలు కూల్చివేశాయని, నగర దక్షిణాన ఉన్న సూపర్ మార్కెట్, నివాస భవనాలపై శిథిలాలు పడ్డాయని మేయర్ సెర్గీ సోబ్యానిస్ టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. ధ్వంసమైన సూపర్ మార్కెట్ కిటికీ, పొగబారిన నివాస భవనం దృశ్యాలను విడుదల చేశారు. మాస్కోలోని నాలుగు ప్రధాన విమానాశ్రయాలతో సహా డజనుకి పైగా విమానాశ్రయాల్లో ఫెడరల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ ఏజన్సీ ఆంక్షలు విధించినట్లు రష్యా మీడియా పేర్కొంది. వోల్గోగ్రాడ్ మరియు నిజ్నీ నోవ్‌గోరోడ్ సహా ఇతర నగరాల్లోని విమానాశ్రయాలు ప్రభావితమయ్యాయి. వొరొనెజ్ మరియు పెన్జా ప్రాంతాలలో వరుసగా 18 మరియు 10 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు ఆప్రాంత గవర్నర్లు తెలిపారు. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అన్నారు. రిల్స్క్ నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌పై దాడి జరిగిందని, ఇద్దరు యువకులు గాయపడ్డారని కుర్స్క్ ప్రాంత తాత్కాలిక గవర్నర్ తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, దీంతో ఈ ప్రాంతంలో విద్యుత్‌ను పూర్తిగా నిలిపివేశామని అన్నారు.

## చర్చలు సఫలం.. ఆర్టీసి సమ్మె వాయిదా

**హైదరాబాద్, :** తెలంగాణలో ఆర్టీసి సమ్మె వాయిదా పడింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఆర్టీసి కార్మిక సంఘాల నేతలు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రేపటి నుంచి రాష్ట్రంలో సమ్మె చేయనున్నట్లు కార్మిక సంఘాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో మంగళవారం తమ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సమ్మె ఆలోచన విరమించుకోవాలని కార్మిక సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు.  సమ్మెకు వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని కోరారు. ఇప్పుడిప్పుడే సంస్థ కోలుకుంటుందని.. సమ్మె చేస్తే నష్టం జరుగుతుందని చెప్పారు. కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. త్వరలోనే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పడంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు.

# ఆనకట్టల కట్టడి

### బాగ్లిహార్, కిషన్ గంగ, సలాల్ ప్రాజెక్టుల నుంచి నీటి నిలిపివేత

### నిలిచిపోయిన ఆరు ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనుల పునరుద్ధరణ

సింధూ, దాని పరీవాహక నదుల నుంచి పాకిస్తాన్‌కు ఇకపై చుక్క నీరు కూడా వదిలేది లేదన్న భారత్, ఆ దిశగా పూర్తిస్థాయి కార్యాచరణకు రంగంలోకి దిగింది. ఆ నదులపై అన్ని జలాశయాల సామర్థ్యాలను పూర్తిస్థాయిలో పెంచే దిశగా చర్యలు తీసుకుంటోంది. వాటిలో పేరుకుపోయిన మట్టి, ఇసుక తదితరాలను పూర్తిగా తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. తద్వారా అన్ని ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వ సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరేలా చూడాలని అధికారులకు సూచించింది. జమ్మూ కశ్మీర్‌లో చినాబ్ నదిపై ఉన్న కీలక బాగ్లిహార్, సలాల్ జల విద్యుత్కేంద్రాల్లో ఆ దిశగా గురువారం లాంఛనంగా మొదలైన పూడికతీత పనులు సోమవారం పూర్తిస్థాయికి చేరాయి. పనుల్లో భాగంగా రెండు డ్యాముల్లో అవసరమైన గేట్లను గురువారం నుంచి శనివారం దాకా పాక్షికంగా ఎత్తడంతో పాక్‌లోని సరిహద్దు ప్రాంతాలు నీటమునిగాయి. సింధూ జల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో ఈ విషయమై పాక్‌కు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. 1960ల్లో ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇలా జరగడం ఇదే తొలిసారి. ఒప్పందాన్ని బూచిగా చూపుతూ పూడిక పనులను పాక్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వచ్చింది. ఇప్పుడిక ఆ ప్రాజెక్టుల్లోని పూడిక మొత్తాన్నీ తొలగించి పూర్తిస్థాయిలో నీటిని నింపనున్నారు. అప్పటిదాకా చినాబ్ నదీజలాలు పాక్‌కు పూర్తిగా నిలిచిపోయినట్టే!. సింధూ ఒప్పందం ప్రకారం చినాబ్ జలాలు పాక్‌కే చెందుతాయి. వాటి ప్రవాహాన్ని భారత్ అడ్డుకోవడానికి వీల్లేదు.

### మూడింటి నుంచి నీళ్లు బంద్

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, దాని పరీవాహక నదులపై ఆరుకు పైగా జలాశయాల్లో పూడికతీతను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న ఆదేశాల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ విభాగాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయి. ప్రభుత్వరంగ ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ సారథ్యంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బాగ్లిహార్, సలాల్‌తో పాటు జీలం నది మీది కిషన్‌గంగ జలాశయాల నుంచి పాక్‌కు నీటి విడుదలను ఆదివారం నుంచి నిలిపేశారు.



దాంతో పాక్‌లోని పంజాబ్ తదితర ప్రాంతాలకు సాగునీరు నిలిచిపోయింది. సలాల్ ప్రాజెక్టును 1987లో, బాగ్లిహార్‌ను 2008లో నిర్మించారు. అప్పటినుంచీ వాటిలో పూడికతీత చేపట్టడం ఇదే తొలిసారి. సలాల్ 690 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. బాగ్లీహార్ సామర్థ్యం 900 మెగావాట్లు. పూడిక నేపథ్యంలో వాటిలో విద్యుదుత్పాదన చాలాకాలంగా సామర్థ్యం కంటే తక్కువగా జరుగుతూ వస్తోంది.

### 10 వేల మెగావాట్ల విద్యుత్

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, ఉప నదులపై మొదలు పెట్టిన ఆరు ప్రాజెక్టులు పాక్ అభ్యంతరాల నేపథ్యంలో చాన్నాళ్లుగా నిలిచిపోయాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో వాటి నిర్మాణాన్ని తక్షణం పునఃప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. సవాల్‌కోట్ (1,856 మెగావాట్లు), కిర్తాయ్ 1, 2 (1,320 ఎంవీ), పాకాల్‌దుల్ (1,000 ఎంవీ)తో పాటు 2,224 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన మరో ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి.  ఇవన్నీ పూర్తయితే ఏకంగా 10 వేల మెగావాట్ల అదనపు విద్యుత్‌తో పాటు సాగు, తాగునీటి అవసరాలకు మరిన్ని జలవనరులు అందుబాటులోకి వస్తాయి. సింధూ ఒప్పందం కింద ఇలాంటి పనులకు పాక్‌కు ఆర్నెల్ల నోటీసు ఇవ్వాల్సి ఉండేది. దాన్ని నిలిపివేసిన నేపథ్యంలో భారత్ తాజా చర్యలను అడ్డుకునేందుకు పాక్‌కు పెద్దగా మార్గాలేమీ లేవు. మధ్యవర్తి అయిన ప్రపంచబ్యాంకు కూడా పెద్దగా చేసేదేమీ లేదు. ఇరు దేశాలనూ చర్చలకు ప్రోత్సహించడం తప్ప ఒప్పందం అమలుకు ఆదేశించడం వంటి అధికారాలేవీ దానికి లేవు.

# రైలు బండి... ఇక పొగ రాదండీ

### డీజిల్‌కు స్వస్తి పలికిన రైల్వే

### దక్షిణ మధ్య రైల్వేలో 100% విద్యుదీకరణ

### అక్కన్నపేట-మెదక్ పనుల పూర్తితో సాధన

### దక్షిణ మధ్య రైల్వే, వాల్తేరు డివిజన్లో పూర్తి

### తెలుగు రాష్ట్రాల్లో విద్యుదీకరణ సంపూర్ణం

### రైల్వేకు తగ్గిన 'చేతి చమురు'

### కి.మీ.కు రూ.270 చొప్పున ఆదా

### తగ్గిన వ్యయం, పర్యావరణ ప్రియం

తెలుగు రాష్ట్రాల్లో పొగబండిని ఇక పొగరాని బండి అని పిలవాలి. ఎందుకంటే.. దేశంలో డీజిల్ రైలింజిన్లకు స్వస్తి చెబుతూ కేవలం కరెంటు ఇంజిన్లతోనే రైళ్లు నడపాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని దక్షిణ మధ్య రైల్వే విజయవంతంగా ఆచరణలోకి తెచ్చింది. 2025 మార్చి నాటికి 100% లైన్లను విద్యుదీకరించాలన్న లక్ష్యాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా 97% సాధించగా, దక్షిణ మధ్య రైల్వే పూర్తిగా సాధించి చూపింది. మరోపక్క వాల్టేర్ డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాల్లోనూ ఇప్పటికే విద్యుదీకరణ పూర్తయింది. తెలుగు రాష్ట్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎలక్ట్రిక్ ఇంజిన్లతోనే రైళ్లను నడిపే పరిస్థితి ఏర్పడింది. దీన్ని రైల్వేలో భారీ విజయంగా భావిస్తున్నారు. డీజిల్ ఇంజిన్ల వల్ల రైల్వే శాఖకు భారీగా చేతి'చమురు'వదులుతోంది. లైన్ల విద్యుదీకరణ ద్వారా, డీజిల్ భారాన్ని తగ్గించుకుని ఆ మొత్తాన్ని రైల్వేల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఖర్చు చేస్తోంది. దేశవ్యాప్తంగా 97% విద్యుదీకరణ సాధించగా, దక్షిణ మధ్య రైల్వే పూర్తిగా సాధించి చూపింది. కర్ణాటక (96%), తమిళనాడు (96%), రాజస్తాన్ (98%) వంటి రాష్ట్రాల్లో ఇంకా పూర్తి కాలేదు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు విద్యుదీకరణ పూర్తయిన రైల్వే ట్రాక్ నిడివి 68,730 కిలోమీటర్లు. ఇందులో గత పదేళ్లలో పూర్తయింది 46,928 కిలోమీటర్లు.

### జోన్‌పరిధిలో ఇలా..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 6,609 రూట్ కి.మీ. మేర రైలు మార్గాలున్నాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రం పరిధిలో 2,015 రూట్ కి.మీ.ల ట్రాక్ ఉంది. వాల్తేర్ డివిజన్ పరిధిలో సుమారు 1,075 రూట్ కి.మీ. మేర ఉంటే.. ఇందులో ఏపీ పరిధిలో దాదాపు 545 కి.మీ.ల ట్రాక్ ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో అక్కన్నపేట-మెదక్ మధ్య 17 కి.మీ. మేర పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. వాటిని వేగంగా నిర్వహించి విద్యుత్తు రైళ్లు నడపడం ప్రారంభించారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే యావత్ దక్షిణ మధ్య రైల్వేలో విద్యుదీకరణ పూర్తయినట్టు తేల్చారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 1,280 విద్యుత్తు లోకోమోటివ్‌లు వినియోగిస్తున్నారు. వీటిలో 291 ఇంజిన్లను ప్రయాణికుల రైళ్లకు వాడుతుండగా, మిగతావాటిని సరుకు రవాణా రైళ్లకు వినియోగిస్తున్నారు. ఇక జోన్‌పరిధిలోనే ఉన్నప్పటికీ, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్-గుల్బర్గా పరిధిలోకి వచ్చే ఖానాపూర్-కమలాపూర్-నందగావ్ మార్గంలో కొంతమేర పని మిగిలి ఉంది. అయితే, దాన్ని నిర్వహించే బాధ్యత దక్షిణ మధ్య రైల్వే సరిహద్దుతో ఉన్న సెంట్రల్ రైల్వేది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే రికార్డు సమయంలో లక్ష్యాన్ని సాధించినట్టయింది.

### ఇంకా డీజిల్ ఇంజిన్లు.. ఎందుకంటే?

వంద శాతం విద్యుదీకరణ జరిగినప్పటికీ, దక్షిణ మధ్య రైల్వే జోన్‌పరిధిలో ఇప్పటికీ 395 డీజిల్ ఇంజిన్లను నిర్వహిస్తున్నారు. వీటిలో 245 ఇంజిన్లను సరుకు రవాణా రైళ్లకు వాడుతున్నారు. అలాగే వాల్టేర్ డివిజన్లో మొత్తం 387 ఇంజిన్లు ఉంటే అందులో డీజిల్ ఇంజిన్లు 162. భవిష్యత్తులో రైళ్లు ఢీకొనటం, వరదలు లాంటి విపత్తులతో విద్యుత్తు సరఫరా వ్యవస్థ దెబ్బతిని కరెంటు ఇంజిన్లు వాడలేని పరిస్థితి ఎదురైతే, అత్యవసర సేవల కోసం ఈ డీజిల్ ఇంజిన్లతో రైళ్లు నడుపుతారు. ఆ సమయంలో డీజిల్ ఇంజిన్లు ఫిట్‌గా ఉండాలంటే వాటిని నిరంతరం వాడాలి.



### ఇక మిగిలిందదే..

తెలంగాణ పరిధిలో ప్రస్తుతం ఒకే ఒక్క కొత్త రైలు మార్గం పనులు జరుగుతున్నాయి. మేడ్చల్ సమీపంలోని మనోహరాబాద్ నుంచి మొదలై కరీంనగర్ శివారులో కొత్తపల్లి వరకు సాగే లైను. ఇందులో సిద్దిపేట వరకు ట్రాక్ ఏర్పాటు పూర్తి కావటంతో రైలు సేవలు కూడా మొదలయ్యాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల మీదుగా పైకి కొనసాగాల్సి ఉంది. ఈ పనులు 2026 నాటికి పూర్తవుతాయి. ఇంతకాలం కొత్త లైన్ల నిర్మాణాన్ని ముందు చేపట్టి, భవిష్యత్తులో కుదిరినప్పుడు మార్గాన్ని విద్యుదీకరించేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి చెప్పి, కొత్త లైన్ల పనులు జరుగుతున్న సమయంలోనే సమాంతరంగా విద్యుదీకరణ పనులూ నిర్వహిస్తున్నారు. ఈమేరకు మనోహరాబాద్-కొత్తపల్లి మార్గాన్ని కూడా విద్యుదీకరించాలని నిర్ణయించింది. 2026 జూన్‌నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పనులు జరుగుతున్న ప్రాజెక్టు కావడంతో దీన్ని విద్యుదీకరణ జాబితాలో చేర్చలేదు. అసంపూర్తి ప్రాజెక్టు కావటంతో దీన్ని విద్యుదీకరణ జరగని ప్రాజెక్టుగా తేల్చలేదు. ఫలితంగా వంద శాతం విద్యుదీకరణ సాధించిన జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే జోన్‌ను రైల్వే శాఖ ప్రకటించింది.

### డీజిల్‌తో రూ.400 కరెంటుతో రూ.130 మాత్రమే

డీజిల్ ఇంజిన్‌నడపడం వల్ల రైల్వేకు ఒక కి.మీ.కు అయ్యే వ్యయం సగటున రూ.400. అదే కరెంటు ఇంజిన్‌కి.మీ.కు 20 యూనిట్ల కరెంటును ఖర్చు చేస్తుంది. ఈ రూపంలో అయ్యే వ్యయం సగటున రూ.130 మాత్రమే. సరుకు రవాణా రైలు నిర్వహణలో డీజిల్‌తో పోలిస్తే కరెంటు ఇంజిన్‌కు మూడో వంతు వ్యయం, ప్రయాణికుల రైలుకు నాలుగో వంతు వ్యయం అవుతుందని అంచనా. రైల్వే శాఖ లెక్కల ప్రకారం.. 2018-19లో రైల్వే శాఖ డీజిల్ రూపంలో చేసిన ఖర్చు రూ.18,587 కోట్లు. విద్యుదీకరణతో ఏటా రూ.1,000 కోట్లకు పైగా మొత్తాన్ని ఆదా చేస్తోంది. గత పదేళ్లలో విద్యుదీకరణ వల్ల దాదాపు 640 కోట్ల లీటర్ల డీజిల్‌ను ఆదా చేసిందని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల 400 కోట్ల కేజీల కర్బన ఉద్గారాల విడుదలను నివారించగలిగాం.

# మితవాదానికి మరో ఓటమి



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గమనించుకుంటున్నారో లేదో గానీ ప్రపంచంలో ఎక్కడ ఎన్ని కలు జరిగినా ఆయన చర్చనీయాంశం అవుతున్నారు. గెలుపోటముల్ని ప్రభావితం చేస్తున్నారు. ఇటీవల కెనడా ఎన్నికల్లో ట్రంప్ పట్ల మెతకగా వ్యవహరించిన కన్సర్వేటివ్‌లు ఓటమిపాలై, ఊహించని రీతిలో అధికార లిబరల్ పార్టీ గెలుపొందింది. ఇప్పుడు ఆస్ట్రేలియాలోనూ అదే జరిగింది. అచ్చం ట్రంప్ విధానాలనే అనుకరిస్తూ ఆస్ట్రేలియా ఎన్నికల్లో తిరుగులేని గెలుపు సాధించాలనుకున్న విపక్ష కన్సర్వేటివ్ పార్టీ అపజయాన్ని మూటకట్టుకోవటమే కాదు... ఆ పార్టీ గెలిస్తే ప్రధాని అవుతారనుకున్న నాయకుడు పీటర్ డటన్ సైతం ఓటమి పాలయ్యారు. 2004 తర్వాత వరసగా రెండోసారి కూడా అధికారం నిలబెట్టుకున్న పార్టీగా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ చరిత్ర సృష్టించింది. ఇక సింగపూర్‌లో ఎప్పటిలా పద్నాలుగోసారి సైతం అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) తిరిగి అధికారంలోకి రావటం వింతేమీ కాదుగానీ... ఆ పార్టీ నేత, ప్రధాని లారెన్స్ వాంగ్ ప్రచారసభల్లో ట్రంప్‌పై రణభేరి మోగించారు. అమెరికా విధించిన సుంకా లకు ప్రతీకార సుంకాలుంటాయని ప్రకటించారు. అసలు అమెరికాకు సింగపూర్ నుంచి ఎగుమతులు చేసేదే లేదని స్పష్టం చేశారు. 97 స్థానాలున్న సభలో  ఆ పార్టీ 87 స్థానాలు గెల్చుకోవటం గతంలో కూడా జరిగినా ఈసారి వోటు శాతాన్ని సైతం 66.57కి పెంచుకుని చరిత్ర సృష్టించింది. ఇక రుమేనియాలో మాత్రం ట్రంప్‌ను తలకెత్తుకున్న తీవ్ర మితవాదపక్షం అలయెన్స్ ఫర్ ది యూనిటీ ఆఫ్ రుమేనియన్స్ (ఏయూఆర్) నాయకుడు జార్జి సైమన్  తొలి రౌండ్‌లో గెలుపొందారు. ఈ నెల 18న జరగబోయే రెండో రౌండ్ ఎన్నికల్లో సైతం ఆయనదే విజయమన్న అంచనాలున్నాయి. వచ్చే సెప్టెంబర్‌లో ఎన్నికలు జరగబోయే నార్వేలో కూడా ట్రంప్ ప్రభావం కనబడుతోంది. అక్కడి అధి కార లేబర్ పార్టీకి ఓటమి తప్పదని జనవరిలో వివిధ సర్వేలు ప్రకటించగా, ఆ మరుసటి నెలకల్లా అంతా మారిపోయింది. ఇప్పుడు లేబర్ పార్టీయే గెలుపుగుర్రంగా కనబడుతోంది. కరోనా దాపురించినప్పటి నుంచీ ఆస్ట్రేలియా ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కాదు. ముఖ్యంగా మూడేళ్లుగా ఆ దేశంలో ఉత్పాదకత తీవ్రంగా దెబ్బతింది. ద్రవ్యోల్బణం పెరిగింది. దాన్ని తగ్గించటానికి ఆస్ట్రేలియా రిజర్వ్‌బ్యాంక్ 13 సార్లు వడ్డీరేట్లు పెంచింది. ఫలితం లేకపోగా అధిక ధరల కారణంగా కొనుగోళ్లు ఆగిపోయి గృహనిర్మాణ రంగం పడకేసింది. వీటన్నిటి వల్ల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఇవన్నీ చూసి తదుపరి ఎన్నికల్లో తమదే విజయమని కన్సర్వే టివ్ పార్టీ కలలుగంది. అమెరికాలో ట్రంప్‌కు పెరుగుతున్న మద్దతు చూసి అదే తరహా ప్రకటనలు చేసి ఆ పార్టీ నాయకుడు డటన్ మొదట్లో వోటర్ల మెప్పు పొందినమాట వాస్తవం. ప్రభుత్వ రంగంలో 40,000 ఉద్యోగాలు రద్దుచేస్తామని, వలసల విషయంలో కఠినంగా వుంటామని, ఉదార వాద విధానాలైన భిన్నత్వం, అందరినీ కలుపుకొనిపోవటం వగైరాలకు కాలం చెల్లిందని ఆయన పదే పదే ప్రకటించారు. ఆస్ట్రేలియా మొదటి నుంచీ అమెరికా మిత్ర దేశమే. అయినా ట్రంప్ ఏమాత్రం కనికరించలేదు. అందరితోపాటు ఆస్ట్రేలియాపైనా భారీయెత్తున సుంకాలు పెంచుతా మని ప్రకటించారు. ఇవింకా అమల్లోకి రాకపోయినా అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కారణంగా అసలే అంతంతమాత్రంగా వున్న ఆర్థిక వ్యవస్థ మరింత అనిశ్చితిలోకి పోయింది. ఈ దశలో డటన్ తనకు ట్రంప్‌తో వున్న వ్యక్తిగత సాన్నిహిత్యం వల్ల ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థను సునాయాసంగా గట్టెక్కిస్తానని హామీ ఇచ్చారు. కానీ ట్రంప్ దూకుడు కారణంగా స్టాక్ మార్కెట్లన్నీ బోల్తా కొట్టడంతో డటన్‌కు దిక్కుతోచలేదు. దాంతో ట్రంప్ ప్రస్తావన మానుకున్నారు. కానీ అప్పటికే జరగా ల్సిన నష్టం జరిగిపోయింది. జనం లేబర్ పార్టీకే వోటేయాలన్న నిర్ణయానికొచ్చారు. సింగపూర్ సైతం ఆర్థిక అస్థిరతలో కొట్టుమిట్టాడుతోంది. అసలే వాణిజ్యం దెబ్బతిని వుండగా ట్రంప్ అధిక సుంకాల ప్రకటన మరింత దెబ్బ తీసింది. ఆస్ట్రేలియా మాదిరే ఆ దేశంలోనూ పౌరులకు సొంతిళ్లు సమకూర్చుకోవటం సమస్యగా మారింది. పెరిగిన ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, ఉద్యో గాలు కోల్పోతామన్న భయాందోళనలు ప్రజల్ని వణికిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంచనాల కన్నా జీడీపీ చాలా తగ్గి 3.8 శాతానికొచ్చింది. వచ్చే త్రైమాసికంలో అది 2 శాతం మించక పోవచ్చు. ట్రంప్ సుంకాల బెదిరింపు సరేసరి. అందుకే ఈ అనిశ్చితిలో పాలకపక్షాన్నే మరోసారి గెలిపించటం ఉత్తమమన్న నిర్ణయానికొచ్చారు. కనుకనే పీఏపీ వోట్ల శాతం 61.2 నుంచి 65.67కి పెరి గింది. సింగపూర్ ఎన్నికల్ని విదేశీ మదుపుదార్లు, అంతర్జాతీయ మీడియా, వివిధ దేశాల ప్రభుత్వాలు శ్రద్ధగా గమనించాయి. ఈ అయిదేళ్లూ సింగపూర్ ఎదుర్కొన్న సమస్యలు అలాంటివి మరి. ఏతావతా ఇప్పటికి ఒక్క రుమేనియా మినహాయించి ట్రంప్‌ను చూసి వాతలు పెట్టుకుంటున్న నాయకులంతా ఊహించని ఓటమితో ఖంగుతింటున్నారు. నిరుడంతా మితవాద పక్షాలు ఎక్కడి కక్కడ విజయం సాధించగా, ప్రస్తుతం ఆ పక్షాలకు ఎదురుగాలి వీస్తోంది. అయితే గెలిచిన పక్షాలు చుట్టుముడుతున్న ఆర్థిక సంక్షోభాలకు ఎదురీదటం, జనం మెప్పు పొందటం అంత సులభమేమీ కాదు. ప్రపంచంతోపాటే మనమూ అని ఈ సంక్షోభాల్ని సరిపెట్టుకునే పరిస్థితుల్లో వారు లేరు. కనుక సమస్యలకు దీటైన పరిష్కారాలు కనుగొనటానికి గద్దెనెక్కిన నాయకులు ప్రయత్నించాల్సి వుంది. వారి మాటెలావున్నా ప్రపంచమంతటా తన కారణంగా మితవాద పక్షాలు బోల్తా కొట్టడాన్ని చూసైనా ట్రంప్ తన విధానాలను మార్చుకుంటారా, లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# స్పోర్ట్స్ న్యూస్

## ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ల కోసం వెస్టిండీస్ జట్టు ప్రకటన



వెస్టిండీస్ క్రికెట్ జట్టు ఈ నెలాఖరులో యూరప్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనలో ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లు ఆడనుంది. ఈ పర్యటనల్లో వన్డే సిరీస్‌ల కోసం 15 మంది సభ్యుల జట్టును విండీస్ క్రికెట్ బోర్డు ఇవాళ ప్రకటించింది. విండీస్ జట్టుకు నాయకుడిగా షాయ్ హోప్ వ్యవహరించనున్నాడు. అతనికి మద్దతుగా అనుభవజ్ఞులైన టాపార్డర్ బ్యాటర్లు బ్రాండన్ కింగ్, ఎవిన్ లెవిస్, కీసీ కార్టీ ఉన్నారు. యువ సంచలనం జువెల్ ఆండ్రూ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆండ్రూ గతేడాది అండర్-19 వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించాడు. ఆ టోర్నీలో 4 మ్యాచ్‌ల్లో సెంచరీ, హాఫ్ సెంచరీ సాయంతో 207 పరుగులు చేశాడు. ఈ ఏడాది బంగ్లాదేశ్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసిన జట్టులోని సభ్యులందరూ ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఐపీఎల్ కారణంగా విధ్వంసకర బ్యాటర్ షిమ్రోన్ హెట్‌మైర్ ఒక్కడు మిస్ అయ్యాడు. రొమారియో షెపర్డ్ లాంటి ఆటగాళ్లు కూడా ఐపీఎల్‌లో ఆడుతున్నా ఈ జట్టులో ఎంపిక చేశారు. ఐపీఎల్ చివరి దశలో ఉండగా విండీస్ యూరప్ పర్యటన మొదలవుతుంది. ఐపీఎల్ 2025 మే 25న పూర్తి కానుండగా.. ఐర్లాండ్‌లో వెస్టిండీస్ పర్యటన మే 21న ప్రారంభమవుతుంది. ఈ పర్యటనలో మూడు వన్డేలు, మూడు టీ20లు జరగనున్నాయి. మే 21, 23, 25 తేదీల్లో డబ్లిన్ వేదికగా మూడు వన్డేలు జరుగుతాయి. ఈ పర్యటనలో టీ20 సిరీస్ కోసం? విండీస్ క్రికెట్ బోర్డు జట్టును ప్రకటించలేదు. ఈ పర్యటన ముగిసిన అనంతరం? విండీస్ జట్టు ఇంగ్లండ్‌కు బయల్దేరుతుంది. ఈ పర్యటనలో కూడా మూడు వన్డేలు, మూడు టీ20లు జరగనున్నాయి. మే 29, జూన్ 1, జూన్ 3వ తేదీల్లో మూడు వన్డేలు జరుగుతాయి. తొలి వన్డే బర్మింగ్హామ్, రెండో వన్డే కార్డిఫ్, మూడో వన్డే లండన్‌లో జరగనున్నాయి. ఈ పర్యటనలో టీ20 సిరీస్ కోసం విండీస్ జట్టును ప్రకటించాల్సి ఉంది. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ల కోసం వెస్టిండీస్ జట్టు: షాయ్ హోప్ (కెప్టెన్), జువెల్ ఆండ్రూ, కీసీ కార్టీ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, జస్టిన్ గ్రీవ్స్, అమీర్ జాంగూ, అల్జరి జోసెఫ్, షమార్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, ఎవిన్ లెవిస్, గుడకేష్ మోటీ, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, జేడన్ సీల్స్, రొమారియో షెపర్డ్ కాగా, ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఆడబోయే వన్డేలు 2027 ఐసీసీ మెన్స్ క్రికెట్ ప్రపంచకప్ నేపథ్యంలో వెస్టిండీస్‌కు చాలా కీలకంగా పరిగణించబడతాయి. ఈ వరల్డ్‌కప్‌కు విండీస్ నేరుగా అర్హత సాధించాలంటే ఈ మ్యాచ్‌లు తప్పనిసరిగా గెలవాలి. ఇదిలా ఉంటే, ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ల కోసం జట్టును ప్రకటించిన విండీస్ క్రికెట్ బోర్డు.. కోచింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఓ కీలక మార్పు చేసింది. జేమ్స్ ఫ్రాంక్లిన్ స్థానంలో 2012 టీ20 వరల్డ్‌కప్ విన్నర్ రవి రాంపాల్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించింది.

## ధోని రిటైర్ అయితే బెటర్!?.. సురేశ్ రైనా 'షాకింగ్' కామెంట్



ధోని- రైనా

ఐపీఎల్-2025 లో చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని కి వరుస చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఇటు సారథిగా.. అటు బ్యాటర్‌గా తలా విఫలమవుతున్నాడు. మరో వైపు.. జట్టు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఐదు మ్యాచ్‌ల తర్వాత రెగ్యులర్ కెప్టెన్ రుత్‌రాజ్ గైక్వాడ్ గాయం వల్ల సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో మరోసారి ధోని బాధ్యతలు చేపట్టాడు. కానీ అతడి సారథ్యంలోనూ కనీవినీ ఎరుగని రీతిలో కంచుకోట చెపాక్‌లో చెన్నై వరుస ఓటములు చవిచూసింది. అంతేకాదు.. ఈ ఏడాది ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా నిలిచింది. ఇక గతేడాది కూడా సీఎస్‌కే ఇలాగే టాప్-4కు చేరకుండానే అవుటైన విషయం తెలిసిందే. వరుసగా ఇలా రెండు సీజన్లలో ప్లే ఆఫ్స్ చేరకపోవడం చెన్నై చరిత్రలోనే తొలిసారి ఇది.

వారిని వదిలించుకోండి

ఈ నేపథ్యంలో సీఎస్‌కే మెగా వేలం-2025లో అనుసరించిన వ్యూహాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, రవిచంద్రన్ అశ్విన్, విజయ్ శంకర్ తదితరులను వదిలించుకుంటేనే చెన్నై జట్టు బాగుపడుతుందని వీరేందర్ సెహ్వాగ్ వంటి మేటి క్రికెటర్లు యాజమాన్యానికి సూచిస్తున్నారు.

ధోని రిటైర్ అయితే బెటర్

మరోవైపు.. వికెట్ కీపర్‌గా రాణిస్తున్నా.. బ్యాటర్‌గా విఫలమవుతున్న ధోని ఇక రిటైర్ పోవాలనే డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఈ సీజన్‌లో తలా ఇప్పటికి పదకొండు మ్యాచ్‌లలో కలిపి 163 పరుగులు మాత్రమే చేయగలిగాడు. స్ట్రైక్‌రేటు 148.18. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఇక ధోని కనిపించకపోవచ్చన్న అభిప్రాయాల నడుమ.. టీమిండియా మాజీ క్రికెటర్, చెన్నై చిన్న తలా సురేశ్ రైనా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

సురేశ్ రైనా 'షాకింగ్' కామెంట్

ఇటీవల ఫిల్మీజ్ఞాన్ షోలో పాల్గొన్న సురేశ్ రైనాకు.. 'ధోని తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ వికెట్ కీపర్‌గా ఎవరుంటారు?' అన్న ప్రశ్న ఎదురైంది. ఇందుకు బదులిస్తూ.. "నిజం చెప్పాలంటే నాకూ తెలియదు. ఎందుకంటే.. ఎంఎస్ ధోని ఇంకో రెండేళ్ల పాటు సీఎస్‌కేకు ఆడతాడు" అంటూ అభిమానుకుల షాక్‌తో కూడిన సర్‌ప్రైజ్ ఇచ్చాడు రైనా. కాగా ఐపీఎల్-2025లో చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పటికి పదకొండు మ్యాచ్‌లలో కేవలం రెండు గెలిచి.. ఏకంగా తొమ్మిది ఓడిపోయింది. నాలుగు పాయింట్లతో పట్టికలో అట్టడుగున పదో స్థానంలో కొనసాగుతోంది. ఇక 43 ఏళ్ల ధోని విషయానికొస్తే.. ఐపీఎల్‌లో 275 మ్యాచ్‌లు ఆడి 5406 పరుగులు సాధించాడు. అతడి ఖాతాలో 24 అర్ధ శతకాలు ఉన్నాయి. మరోవైపు 38 ఏళ్ల సురేశ్ రైనా కూడా గతంలో చెన్నైకి ఆడిన విషయం తెలిసిందే. ఓవరాల్‌గా క్యాష్ రిచ్ లీగ్‌లో 205 మ్యాచ్‌లు ఆడి 5528 రన్స్ సాధించి.. మిస్టర్ ఐపీఎల్‌గా పేరొందాడు.

## అందుకే టీమిండియా, ఆర్సీబీ కెప్టెన్‌గా తప్పుకొన్నా



టీమిండియా బ్యాటర్‌గా, కెప్టెన్‌గా ఎన్నో అరుదైన ఘనతలు సాధించాడు విరాట్ కోహ్లి . అయితే, 2021 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో పొట్టి ఫార్మాట్ పగ్గాలు వదిలేశాడు. అదే ఏడాది తన ఐపీఎల్ జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గానూ కోహ్లి వైదొలిగాడు. ఆ మరుసటి సంవత్సరం టీమిండియా వన్డే, టెస్టు జట్టు సారథిగానూ తప్పుకొన్నాడు.ఆ తర్వాత కోహ్లి 2.0గా తిరిగొచ్చి ప్రస్తుతం ఇటు టీమిండియా వన్డే, టెస్టు జట్లలో.. అటు ఆర్సీబీలో స్టార్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం ఐపీఎల్-2025 తో బిజీగా ఉన్న ఈ బెంగళూరు ఆటగాడు.. తాను కెప్టెన్సీ నుంచి వైదొలగడానికి కారణాల గురించి తాజాగా మాట్లాడాడు.

అందుకే టీమిండియా, ఆర్సీబీ కెప్టెన్‌గా తప్పుకొన్నా

ఆర్సీబీ బోల్డ్ డైరీస్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "ఒకానొక సమయంలో... పరిస్థితులన్నీ కఠినంగా మారిపోయాయి. నా కెరీర్‌లో చాలా మార్పులు జరిగిపోతున్నాయి. అప్పటికి ఏడు- ఎనిమిదేళ్ల నుంచి నేను టీమిండియా కెప్టెన్‌గా ఉన్నాను.ఆర్సీబీకి తొమ్మిదేళ్లుగా సారథిగా కొనసాగుతున్నాను. ఆ సమయంలో నా బ్యాటింగ్ మీద కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రతీ మ్యాచ్‌లోనూ నేను బాగా ఆడాలనే ఆకాంక్షలు ఉన్నాయి. కెప్టెన్‌గా ఉన్నా.. బ్యాటర్‌గా కొనసాగినా ఇలాంటివి తప్పదని అర్థమైంది. 24లో7 నేను ఎక్స్‌పోజ్ అవుతూనే ఉంటా. ఇది నాకు కఠినంగా తోచింది.పరిస్థితులు నా ఆధీనంలో లేకుండా పోయాయి. అప్పుడే నేను సంతోషంగా ఉండాలని.. నా ఆనందం కోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నా. అందుకే కెప్టెన్సీ నుంచి వైదొలిగాను. వ్యక్తిగత జీవితంలో నా కంటూ కొన్ని ప్రత్యేక పేజీలు ఉండాలి.ఆటగాడిగా వచ్చి నా పని పూర్తి చేసి వెళ్లాలి.. నా ఆటను విమర్శించే అవకాశం ఇవ్వకూడదని డిసైడ్ అయ్యాను. ఈ సీజన్‌లో జరుగుతున్నది ఇదే" అని విరాట్ కోహ్లి చెప్పుకొచ్చాడు. కాగా అండర్-19 క్రికెట్‌లో కెప్టెన్‌గా భారత్‌కు టైటిల్ అందించాడు కోహ్లి. ఈ క్రమంలో జాతీయ జట్టులోకి దూసుకువచ్చిన ఈ ఢిల్లీ బ్యాటర్.. మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంలో రాటుదేలాడు.

కెప్టెన్‌గానూ తనదైన ముద్ర

బ్యాటింగ్ ఆర్డర్లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ.. ఇప్పటి వరకు ఎవరికీ సాధ్యం కాని రికార్డులెన్నో సాధించాడు. కెప్టెన్‌గానూ తనదైన ముద్ర వేశాడు. ఆస్ట్రేలియాలో టెస్టుల్లో భారత్‌ను విజేతగా నిలపడం కోహ్లి కెరీర్‌లో చిరస్మరణీయంగా గుర్తుండిపోతుంది.ఇక భారత జట్టు సారథిగా మూడు ఫార్మాట్లలో కలిపి 213 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి ఖాతాలో 135 విజయాలు ఉన్నాయి. అదే విధంగా ఆటగాడిగా.. 2008 నుంచి ఇప్పటి వరకు టీమిండియా తరఫున ఈ కుడిచేతి వాటం బ్యాటర్ 123 టెస్టులు, 302 వన్డేలు, 125 టీ20లు పూర్తి చేసుకున్నాడు.

రికార్డుల రారాజు

టెస్టుల్లో 9230, వన్డేల్లో 14181, టీ20లలో 4188 పరుగులు సాధించాడు. కోహ్లి ఖాతాలో 30 టెస్టు సెంచరీలు, వన్డేల్లో 51 శతకాలు, అంతర్జాతీయ టీ20లలో ఒక సెంచరీ ఉంది. తద్వారా ఓవరాల్‌గా 82 సెంచరీలతో.. శతక శతకాల ధీరుడు సచిన్ టెండుల్కర్ తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు కోహ్లి. ఇక వన్డేల్లో 51 సెంచరీలతో సచిన్‌ను కూడా దాటేసి అత్యధిక శతకాల వీరుడిగా చరిత్ర సృష్టించాడు కూడా!.. ఐపీఎల్ కెరీర్ విషయానికొస్తే.. 2008 నుంచీ ఆర్సీబీకే ఆడుతున్న కోహ్లి 263 మ్యాచ్‌లలో ఎనిమిది శతకాలతో కలిపి 8509 పరుగులతో టాప్ రన్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఐపీఎల్-2025లోనూ ఇప్పటికి పదకొండు మ్యాచ్‌లలో కలిపి 505 పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా ఉన్నాడు.

## ఎంత మందిని మారుస్తారు? ఢిల్లీ క్యాపిటల్స్‌ది తప్పుడు నిర్ణయం: వాట్సన్

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అనుసరించిన వ్యూహాలను ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ విమర్శించాడు.ప్లే ఆఫ్స్ చేరాలంటే కీలకమైన మ్యాచ్‌లోనూ ఓపెనింగ్ జోడీని మార్చడం తనను విస్మయానికి గురిచేసిందన్నాడు. ఢిల్లీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని బుద్ధిలేని చర్యగా అభివర్ణించాడు. ఐపీఎల్-2025 లో ఢిల్లీ తరఫున జేక్ ఫ్రేజర్ మెగర్క్, అభిషేక్ పోరెల్, ఫాఫ్ డుప్లెసిస్, కేఎల్ రాహుల్ వేర్వేరు మ్యాచ్‌లలో ఓపెనర్లుగా వచ్చారు. తాజాగా సోమవారం సన్‌రైజర్స్‌తో మ్యాచ్ సందర్భంగా డుప్లెసిస్‌తో కలిసి కరుణ్ నాయర్ ఢిల్లీ ఇన్నింగ్స్ ఆరంభించాడు.

### బంతి పడటంతోనే క్యాపిటల్స్‌కు కష్టాలు

అయితే, బంతి పడటంతోనే క్యాపిటల్స్‌కు కష్టాలు మొదలయ్యాయి. మొదటి బంతికే కరుణ్ నాయర్ (0) డకౌట్ అయ్యాడు. కాసేపటికే డుప్లెసిస్ (3), అభిషేక్ పోరెల్ (8)లు కూడా వికెట్లను పారేసుకున్నారు. దీంతో క్యాపిటల్స్ 15 పరుగులకే 3 వికెట్లను కోల్పోయింది.

ఈ మూడు వికెట్లూ రైజర్స్ కెప్టెన్ కమిన్స్ ఖాతాలోనే పడ్డాయి. క్యాచ్‌లన్నీ కీపర్ ఇషాన్ కిషన్ చేతికే అందాయి. ఇక ఢిల్లీ ఈ షాక్ నుంచి తేరుకోకముందే హర్షల్ పటేల్ మరోదెబ్బ తీశాడు. కెప్టెన్ అక్షర్ పటేల్ (6)ను అవుట్ చేశాడు. ఆఫ్ స్టంప్ మీదుగా వేసిన స్లో డెలివరీని షాట్ ఆడే ప్రయత్నం చేయగా అదికాస్తా కమిన్స్ చేతికి చిక్కింది. దీంతో పవర్ ప్లేలో ఢిల్లీ నాలుగో వికెట్‌ను కోల్పోయింది. అప్పటికి క్యాపిటల్స్ స్కోరు 26/4. ఆ తర్వాత కూడా క్యాపిటల్స్ పరిస్థితిలో ఏమార్పు లేదు. ఇక ఢిల్లీ అండదండా కేఎల్ రాహులే అనుకునేలోపే ఈ స్టార్ మురిపెం కూడా అంతలోనే ముగిసింది. జయదేవ్ ఉనాద్కట్ తెలివైన బంతితో ఈ విలువైన వికెట్ తీసి ఢిల్లీని కోలుకోకుండా చేశాడు. ఆఫ్ స్టంప్ ఆవల దూసుకొచ్చిన బంతి రాహుల్ (10) బ్యాట్‌ను తాకుతూ ఇషాన్ కిషన్ చేతుల్లోకి వెళ్లింది. అప్పటివరకు పెవిలియన్ చేరిన ఐదుగురిలో అతనొక్కడిదే రెండంకెల స్కోరు కాగా... కనీసం మూడు పదుల స్కోరైన కాకముందే (29 పరుగులకే 5) ఢిల్లీ సగం వికెట్లను కోల్పోయింది. వికెట్ల జోరులో మెరుపుల్లేని మ్యాచ్‌లో ఎట్టకేలకు పదో ఓవర్లో ఒక సిక్స్ నమోదైంది. స్పిన్నర్ జీషాన్ బౌలింగ్‌లో విప్రాజ్ నిగమ్ భారీ సిక్సర్ బాదాడు. సగం ఓవర్లు ముగిశాక గానీ 11వ ఓవర్లో జట్టు స్కోరు కష్టంగా 50 పరుగులకు చేరింది.

### అశుతోశ్ వచ్చాకే...

స్టబ్స్, విప్రాజ్ కుదురుకునే అవకాశాన్ని కూడా సన్‌రైజర్స్ ఫీల్డర్లు ఇవ్వలేదు. కొద్దిసేపటికే విప్రాజ్ (17 బంతుల్లో 18బీ 1 ఫోర్, 1 సిక్స్) రనౌట్ కాగా... అశుతోష్ రాకతో స్కోరులో కాస్త వేగం పెరిగింది. అవతలి ఎండ్‌లో ఉన్నది హిట్టర్ స్టబ్సే అయినా జోరు పెంచింది మాత్రం అశుతోష్ మొదట్లో సింగిల్స్‌తో పరుగు...

పరుగు పేర్చిన ఈ జోడీ తర్వాత ధాటిని ఆడింది. జీషాన్ 15వ ఓవర్లో అశుతోష్ రెండు భారీ సిక్సర్లతో అలరించాడు. తర్వాత హర్షల్ 17వ ఓవర్లో రెండు బౌండరీలు బాదాడు. స్టబ్స్ కూడా ఫోర్లతో వేగం అందుకోగా, డెత్ ఓవర్లో మరో సిక్స్ కొట్టిన అశుతోష్ ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు. ఇద్దరు కలిసి ఏడో ఓవర్‌కు 66 పరుగులు జోడించారు.

ఈ జోడీ ఆడటం వల్లే ఢిల్లీ ఆలౌట్ నుంచి తప్పించుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 133 పరుగులు చేయగలిగింది.


### ఢిల్లీ క్యాపిటల్స్‌ది తప్పుడు నిర్ణయం

ఈ నేపథ్యంలో కామెంటేటర్ షేన్ వాట్సన్ మాట్లాడుతూ.. "ఎప్పటికప్పుడు ఏ కారణం లేకుండా.. నచ్చినట్లుగా ఓపెనింగ్ జోడీని మార్చడం సరికాదు. నిజంగా ఢిల్లీ వ్యూహం చూసి నేను ఆశ్చర్యపోయా.


కరుణ్ నాయర్ ఫాఫ్ డుప్లెసిస్‌తో కలిసి ఓపెనింగ్‌కు రావడం చూసి నాకు మతిపోయినంత పనైంది. ఇదొక చెత్త నిర్ణయం. ఢిల్లీ శిబిరం ఏం ఆలోచించి ఇలా చేసిందో గానీ.. ఇదైతే తప్పుడు నిర్ణయం.

ఇలా చేయడం వల్ల జట్టులో ఎవరి పాత్ర ఏమిటన్నది ఆటగాళ్లకే తెలియకుండా పోతుంది. ఇలాంటి చర్యల వల్ల వాళ్లు కూడా అభద్రతాభావంలో కూరుకుపోతారు" అని స్టార్ స్పోర్ట్స్ షోలో తన అభిప్రాయం పంచుకున్నాడు.

ఇదిలా ఉంటే.. ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత ఎడతెరిపిలేని వర్షం వల్ల మ్యాచ్ రద్దై పో?యింది. దీంతో ఢిల్లీకి అదృష్టం కలిసి రాగా.. సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. మ్యాచ్ రద్దు కావడం వల్ల ఇరుజట్లకు చెరో పాయింట్ రాగా.. ఢిల్లీ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవమయ్యాయి.




## 'అరంగేట్రం'లోనే అదుర్స్.. చరిత్ర సృష్టించిన ఇషాన్ కిషన్



ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ సందర్భంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఇషాన్ కిషన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో ఇంత వరకు ఏ వికెట్ కీపర్‌కూ సాధ్యం కాని అరుదైన ఘనత సాధించాడు. కాగా ఐపీఎల్-2025 మెగా వేలానికి ముందు ముంబై ఇండియన్స్ ఇషాన్‌ను వదిలివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 11.25 కోట్ల భారీ ధరకు అతడిని కొనుగోలు చేసింది. ఇందుకు తగ్గట్లుగానే ఈ జట్టు తరఫున తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ ఇరగదీశాడు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం 47 బంతుల్లోనే 106 పరుగులతో అజేయంగా నిలిచాడు. తద్వారా రాజస్తాన్ రాయల్స్‌పై సన్‌రైజర్స్ గెలవడంలో కీలక పాత్ర పోషించి.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కానీ తర్వాత మాత్రం ఇషాన్ కిషన్ వరుసగా విఫలమయ్యాడు. ఒకానొక దశలో తుదిజట్టు నుంచి తప్పించాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి తరుణంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో సోమవారం నాటి మ్యాచ్‌లో తొలిసారిగా అతడికి యాజమాన్యం వికెట్ కీపింగ్ బాధ్యతలు అప్పగించింది.

### హెన్రిచ్ క్లాసెన్ స్థానంలో

హెన్రిచ్ క్లాసెన్‌ను బ్యాటర్‌గా రంగంలోకి దింపి.. అతడి స్థానంలో ఇషాన్‌ను తమ జట్టు వికెట్ కీపర్‌గా అరంగేట్రం చేయించింది. ఉప్పల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆదిలోనే షాకుల మీద షాకులు తగిలాయి. ఓపెనర్ కరుణ్ నాయర్‌ను డకౌట్ చేసిన రైజర్స్ సారథి, స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్.. ఆ తర్వాత మరో ఓపెనర్ ఫాఫ్ డుప్లెసిస్ (3) వికెట్ తీశాడు. అనంతరం వన్‌డౌన్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ (8)ను కూడా వెనక్కి పంపించాడు. ఈ ముగ్గురూ కమిన్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చి దాదాపుగా ఒకే రీతిలో అవుటయ్యాడు.

### టాప్-4 బ్యాటర్ల వికెట్లలో భాగమై

ఆ తర్వాత జయదేవ్ ఉనాద్కట్ బౌలింగ్ ఢిల్లీ స్టార్ కేఎల్ రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను కూడా ఇషాన్ ఒడిసిపట్టాడు. తద్వారా ఢిల్లీ ఇన్నింగ్స్‌లో టాప్-4 బ్యాటర్ల వికెట్లలో భాగమై.. సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో ఇలా ఓ వికెట్ కీపర్ ప్రత్యర్థి జట్టుకు చెందిన నలుగురు టాప్ బ్యాటర్ల క్యాచ్ అందుకోవడం ఇదే తొలిసారి. ఇక ఓవరాల్‌గా ఐపీఎల్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ క్యాచ్‌లు అందుకున్న 27వ ఆటగాడిగా ఇషాన్ నిలిచాడు. ఇందులోని వికెట్ కీపర్ల జాబితాలో అతడిది పదమూడో స్థానం కావడం గమనార్హం.

### ప్లే ఆఫ్స్ రేసు నుంచి అవుట్

మ్యాచ్ విషయానికొస్తే.. టాపార్డర్ విఫలమైన వేళ మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్ (10), కెప్టెన్ అక్షర్ పటేల్ (6) కూడా నిరాశపరిచారు. అయితే ఆరు, ఎనిమిదో స్థానాల్లో వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్ (41 నాటౌట్), అశుతోష్ శర్మ (41) రాణించడంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది.

అయితే, ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత వర్షం పడింది. అవుట్‌ఫీల్డ్ మొత్తం తడిగా మారడంతో మ్యాచ్ కొనసాగే వీలు లేకపోవడంతో అంపైర్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ రాగా.. సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. మరోవైపు.. ఢిల్లీ ఆశలు మాత్రం ఇంకా సజీవంగానే ఉన్నాయి.

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com
గురువారం - 12 - జూన్ - 2025

# సినిమా చిత్రం

## వీరమల్లు కోసం త్రివిక్రమ్.. ఒక్కొక్కరు ఒక్కోలా..



టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చేతిలో ఉన్న హరిహర వీరమల్లు మూవీ ఇప్పుడు చివర దశలో ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా షూటింగ్ కు మేకర్స్ గుమ్మడికాయ కొట్టేసినట్లు తెలుస్తోంది. మే 30వ తేదీన సినిమాను రిలీజ్ చేస్తామని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేసినా.. దానిపై ఇంకా క్లారిటీ ఇవ్వలేదు. అయితే ఇప్పుడు వీరమల్లు షూటింగ్ చివరి రెండు రోజులు.. సెట్స్ లో త్రివిక్రమ్ కనిపించారు. ఆయన డైరెక్షన్ ను పర్యవేక్షించారని వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే వీరమల్లుకు ముగ్గురు డైరెక్టర్స్ అయినట్లే. ఎందుకంటే స్టార్ డైరెక్టర్ క్రిష్.. సినిమాను 80 శాతం పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన తప్పుకోగా జ్యోతికృష్ణ బాధ్యతలు తీసుకున్నారు.ఇప్పుడు త్రివిక్రమ్ హ్యాండ్ కూడా ఉందని వార్తలు వస్తున్నాయి. ఏదేమైనా ఆయన, పవన్ మంచి క్లోజ్ ఉన్న విషయం తెలిసిందే. పవర్ స్టార్ సినిమాల్లో త్రివిక్రమ్ హ్యాండ్ ఏదో ఒక విధంగా ఉంటుంది. ఇప్పుడు ఆ స్నేహధర్మంతో వీరమల్లు దర్శకత్వ పర్యవేక్షణ చేశారని టాక్. ప్రస్తుతం ఆ విషయం వైరల్ గా మారగా.. ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు.నిజానికి వీరమల్లు ప్రాజెక్టు చాలా ఏళ్ల క్రితం మొదలైంది. కానీ అనేక కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడుతూ వస్తోంది. బజ్ కాస్త తగ్గినా.. ఫ్యాన్స్ మాత్రం ఇంట్రెస్ట్ తో ఉన్నారు. మరికొందరు మాత్రం అవుట్ పుట్ పై హోప్స్ లేవ్ అంటున్నారు. అలాంటి సమయంలో త్రివిక్రమ్.. హ్యాండ్ వేయడం మంచిదేనని కొందరు చెబుతున్నారు. మరికొందరు మాత్రం.. మూవీ అవుట్ పుట్ తేడా కొడితే త్రివిక్రమ్ కు పెద్ద తలనొప్పిగా మారుతుందని అంటున్నారు. ఎందుకంటే ఆయన గత మూవీ గుంటూరు కారం విషయంలో అనేక విమర్శలు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అదే సఅమయంలో డైరెక్టర్లు ఎక్కువ మంది అయితే ప్రతికూల ప్రభావం పడుతుందని అంటున్నారు.ఏదేమైనా బిజీగా ఉన్నా.. త్రివిక్రమ్ పవన్ కోసం రంగంలోకి దిగినట్లు అర్థమవుతోంది. ఓవైపు ఆయన బన్నీ ప్రాజెక్టు కోసం స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేస్తున్నారు. మరోవైపు మరో బడా సినిమా కోసం బ్యాక్ గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సమయంలో త్రివిక్రమ్.. వీరమల్లు వర్క్ చేస్తున్నారు. మరి ఆ సినిమా ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## అక్కడ రికార్డుల మోతమోగిస్తున్న లాలిటన్



మోహల్ లాల్.. మాలీవుడ్ స్టార్స్ అంతా ముద్దుగా పిలుచుకునే పేరు లాలిటన్. విభిన్నమైన సినిమాలతో ఎప్పటికప్పుడు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుంటారు. తనదైన మార్కు సినిమాలతో మలయాళ బాక్సాఫీస్ లెక్కల్ని సరిచేస్తూ సరికొత్త రికార్డులు సృష్టిస్తుంటారు. ఇటీవల %-%ఎంపూరన్ 2%-%తో ప్రేక్షకుల ముందుకొచ్చిన మోహన్‌లాల్ ఈ సినిమాతో మాలీవుడ్‌కు రూ.300 కోట్ల మార్కు వసూళ్లని పరిచయం చేసి ఔరా అనిపించారు. దీని నుంచి మలయాళ ప్రేక్షకులు బయటికి రాకముందే మోహన్ లాల్ మరో థ్రిల్లర్‌ని అందించారు.అదే 'తుడరుమ్' పరువు హత్య నేపథ్యంలో సాగే ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. తరుణ్ మూర్తి దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 25న మలయాళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. అయితే తెలుగులో పెద్దగా ప్రమోషన్స్ చేయకపోయినా మౌత్ టాక్‌తో మంచి వసూళ్లనే రాబడుతోంది. అంతే కాకుండా మలయాళంలో ఈ సినిమా రికార్డు స్థాయి వసూళ్ల దిశగా పయనిస్తూ మలయాళ ఇండస్ట్రీలో సరికొత్త రికార్డు దశగా పయనిస్తోంది. ఇప్పటి వరకు ఈ సినిమా రూ.100 కోట్ల మార్కుని దాటేసి భారీ వసూళ్ల దిశగా పయనిస్తోంది.మే 9న తమిళ వెర్షన్ కూడా రిలీజ్ కాబోతోంది. ఈ మూవీ విడుదలై ఇప్పటి వరకు 12 రోజులవుతోంది. ఇప్పటి వరకు ఇండియావైడ్‌గా ఈ మూవీ రూ.72.20 కోట్లు రాబట్టింది. గ్రాస్ పరంగా చూస్తే రూ.85.19 కోట్లు.ఓవర్సీస్ గ్రాస్ రూ.77.50 కోట్లు వసూలు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా సాధించిన గ్రాస్ రూ.162.69 కోట్లు. విడుదలైన అతితక్కువ రోజుల్లోనే ఓ మలయాళ సినిమా ఈ స్థాయి వసూళ్లని రాబట్టడం ఇదే తొలి సారి కావడంతో - తుడరమ్%-% ఇండస్ట్రీ రికార్డుని క్రియేట్ చేయడం విశేషం.

మలయాళం తరహాలో తెలుగు వెర్షన్‌కు కూడా ప్రమోషన్స్ భారీ స్థాయిలో చేసివుంటే ఫలితం రికార్డు స్థాయిలో ఉండేదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఏది ఏమైనా మోహన్‌లాల్ మూవీ కేవలం పది రోజుల్లోనే రికార్డు స్థాయి వసూళ్లు రాబడు తుండటంతో మలయాళ ఇండస్ట్రీ ఊపిరి పీల్చుకుంటోందట. పెద్ద సినిమా ఈ రేంజ్‌లో వసూళ్లని రాబడితే రానున్న రోజుల్లో మరిన్ని బిగ్ బడ్జెట్ మూవీస్‌కు ఆస్కారం ఏర్పడు తుందని పలు వురు ట్రేడ్ వర్గాలు కామెంట్ చేస్తున్నాయి.

## తమిళ సినిమా తెలుగు రైట్స్‌కు భారీ పోటీ!



ఎప్పుడు ఏ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందో ఎవరూ అంచనా వేయలేరు. భారీ తారాగణం, స్టార్ కాస్ట్, భారీ బడ్జెట్‌తో తీసినా అందులో కథ, కథనాలు కరెక్ట్‌గా లేకపోతే దాన్ని ప్రేక్షకులు పెద్దగా ఆదరించరు. పెద్దగా పట్టించుకోరు. అదే కంటెంట్ బాగుండి అందులో పెద్ద స్టార్స్‌లేకపోయినా ప్రేక్షకులు దానికి బ్రహ్మరథంపడుతుంటారు. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తుంటారు. ఆ మధ్య విడుదలైన %-%బలగం%-% ఈ విషయాన్ని నిరూపించి కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరించి బ్రహ్మరథం పడతారని నిరూపించింది.ఈ మూవీ తరువాత ఎన్నో చిన్న సినిమాలు కంటెంట్ ని నమ్ముకుని ప్రేక్షకుల ముందుకొచ్చాయి. విజయాలు సాధించాయి. ఇప్పుడు ఇదే తరహాలో కంటెంట్ ప్రధానంగా తెరకెక్కిన తమిళ సినిమా ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. అదే టూరిస్ట్ ఫ్యామిలీ. దర్శకుడు, హీరో శశికుమార్ హీరోగా నటించారు. సిమ్రాన్ ఆయనకు జోడీగా నటించిన ఈ మూవీకి అభిషన్ జీవీనాథ్ దర్శకత్వం వహించాడు. శ్రీలంక జాఫ్నాలో ఆర్థిక సంక్షభం తలెత్తడంతో ఆదేశాన్ని, ఉంటున్న జాఫ్నాని ఫ్యామిలీతో వీడిన ఓ వ్యక్తి చెన్నై చేరుకుంటాడు. ఆ తరువాత ఏం జరిగింది? అతని ఫ్యామిలీ స్టోరీ ఎలాంటి మలుపులు తిరిగింది? అన్నదే ప్రధాన కథ. కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఇండియాలో ఏప్రిల్ 29న, వరల్డ్ వైడ్‌గా మే 1న విడుదలైంది. కేవలం ఏడు కోట్లతో నిర్మించిన ఈ సినిమా ఇప్పటి సూపర్ హిట్ టాక్‌తో రన్నవుతూ రూ.17కోట్లు రాబట్టింది. అంతే కాకుండా తమిళనాడు వ్యాప్తంగా ఈ మూవీ రూ.12 కోట్లని రాబట్టింది. తమిళంలో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై సంచలనాలు సృష్టిస్తున్న ఈ సినిమాపై మన వాళ్లు కన్నుపడింది. దీంతో తెలుగు డబ్బింగ్ హక్కుల కోసం భారీ డిమాండ్ ఏర్పడినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. శశికుమార్, సిమ్రాన్ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితులే కావడంతో దీన్ని తెలుగులో డబ్ చేయాలని మన వాళ్లు పోటీపడుతున్నారట. అయితే మేకర్స్ మాత్రం డబ్బింగ్ రైట్స్ కోసం భారీగా డిమాండ్ చేస్తున్నారని ఇన్ సైడ్ టాక్.

## కోలీవుడ్ ఎంట్రీ.. క్యారెక్టర్ గుట్టు విప్పిన సుహాస్




టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్.. వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. గత ఏడాది అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్, శ్రీరంగ నీతులు, జనక అయితే గనక, ప్రసన్న వదనం, గొర్రె పురాణం అంటూ బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు తెలుగులో మూడు, నాలుగు సినిమాల్లో నటిస్తున్నారు సుహాస్. అదే సమయంలో కోలీవుడ్ మూవీ మండాడిలో కూడా యాక్ట్ చేస్తున్నారు. తమిళ సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్నారు. యాక్టర్ సూరి లీడ్ రోల్ లో నటిస్తున్న ఆ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్.. గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. రా అండ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందనున్న ఆ మూవీకి మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ అందుకుని దూసుకుపోతోంది. వైల్డ్ లుక్ లో సుహాస్ ఆకట్టుకున్నారు. ఆయన మేకోవర్ చూసి అంతా షాకయ్యారు. కోలీవుడ్ లో సుహాస్ గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనున్నారని అంతా కామెంట్లు పెడుతున్నారు. అదే సమయంలో కొద్దిరోజులుగా పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. సూరి తమిళ వెర్షన్ లో హీరోగా నటిస్తున్నారని, తెలుగులో హీరోగా సుహాస్ యాక్ట్ చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో తాజాగా సోషల్ మీడియాలో సుహాస్ క్లారిటీ ఇచ్చారు. మండాడి సినిమాలో తాను విలన్ గా మాత్రమే నటిస్తున్నట్లు వెల్లడించారు. అలా ఇప్పుడు నెట్టింట వస్తున్న వార్తలకు చెక్ పెట్టారు సుహాస్. "హలో. నా నెక్స్ట్ మూవీ కోలీవుడ్ సినిమా మండాడి గురించి చిన్న క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సినిమా తెలుగులో కూడా రిలీజ్ కానుంది. అయితే తెలుగు వెర్షన్ లో నేను హీరోగా నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కానీ ఆ వార్తలు నిజం కావు. నేను కేవలం విలన్ రోల్ ను పోషిస్తున్నారు. సూరి అన్నయ్య హీరోగా నటిస్తున్నారు" అంటూ సుహాస్ పోస్ట్ పెట్టారు. ఇక మండాడి మూవీ విషయానికొస్తే.. మహిమా నంబియార్ హీరోయిన్ గా నటిస్తున్నారు. సత్యరాజ్, అచ్యుత్ కుమార్, సచ్చనా నమిదాస్, రవీంద్ర విజయ్ తదితరులు కీలక పాత్రల్లో సందడి చేస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమా ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## బేబీ బంప్‌తో చరణ్ హీరోయిన్



ఒకప్పుడు హీరోయిన్స్ ప్రెగ్నెంట్ విషయాన్ని ముందే రివీల్ చేసేవారు కాదు. కానీ ఇప్పుడు హీరోయిన్స్ ప్రెగ్నెన్సీ విషయాన్ని వెంటనే ఓపెన్‌గా చెబుతున్నారు. సోషల్ మీడియా ద్వారా తమ ఆనందాన్ని షేర్ చేసుకుంటూ ఉన్నారు. అంతే కాకుండా హీరోయిన్స్ సోషల్ మీడియాలో ఎప్పటిలాగే రెగ్యులర్ ఫోటో షూట్స్‌ను షేర్ చేస్తూ ఉన్నారు. అంతే కాకుండా బేబీ బంప్ ఫోటో షూట్స్‌ను కూడా వదలకుండా షేర్ చేస్తున్న హీరోయిన్స్ ఈ మధ్య కాలంలో చాలా మంది ఉన్నారు. హీరోయిన్స్‌గా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మలు పెళ్లి, పిల్లల తర్వాత కూడా సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు చేరువగా ఉంటున్నారు. ఇండస్ట్రీలో ఆఫర్లు లేకున్నా సోషల్ మీడియా ద్వారా వారు జనాల్లోనే ఉంటున్నారు. తాజాగా రామ్ చరణ్‌తో కలిసి ఇటీవల గేమ్ ఛేంజర్ సినిమాలో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వానీ బేబీ బంప్ ఫోటోలను షేర్ చేసింది. కియారా అద్వానీ ప్రెగ్నెంట్ అనే విషయం ఇప్పటికే అందరికీ తెలిసిందే. ఇటీవల ఫోటోలను షేర్ చేస్తూనే ఉంది. కానీ బేబీ బంప్ కనిపించకుండా కాస్త జాగ్రత్తగా ఫోటో షూట్స్ ఇస్తూ వచ్చింది. ఈసారి ఆమె తన బేబీ బంప్‌ను హైలైట్ చేస్తూ



మరీ ఫోటో షూట్‌కి ఫోజ్ లు ఇచ్చింది. రెగ్యులర్‌గా స్కిన్ షో ఫోటోలు షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచి, వైరల్ అవుతూ ఉండే కియారా అద్వానీ ఈసారి బేబీ బంప్ ఫోటోలతోనూ వార్తల్లో నిలవడం మాత్రమే కాకుండా వైరల్ అవుతోంది.కియారా అద్వానీ తాజా ఫోటో షూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. విభిన్నమైన డిజైనర్ డ్రెస్‌లో కియారా అద్వానీ లుక్ అదిరి పోయింది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు, అందమైన ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చే కియారా అద్వానీ బేబీ బంప్ తో కూడా చాలా అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తల్లి కాబోతున్న కారణంగా కియారా అద్వానీ గత కొన్ని నెలలుగా షూటింగ్స్‌కు దూరంగా ఉంది. వార్ 2 సినిమాలో ఈమె నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ సినిమా కి సంబంధించిన షూటింగ్ ఇంకాస్త బ్యాలెన్స్ ఉందని తెలుస్తోంది. ఆ షూటింగ్‌కి కియారా ఎప్పుడు హాజరు అయ్యేది తెలియాల్సి ఉంది. హీరోయిన్‌గా కియారా అద్వానీ ముందు ముందు మరిన్ని సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. బాలీవుడ్ హీరో సిద్దార్థ్ మల్హోత్ర తో ప్రేమలో పడ్డ కియారా అద్వానీ 2023 లో వివాహం చేసుకున్న విషయం తెల్సిందే. వీరి పెళ్లి వైభవంగా జరిగింది. పెళ్లి తర్వాత కొన్నాళ్ల తర్వాత పిల్లల ప్లాన్ ఉంటుందని అంతా భావించారు. కానీ రెండేళ్లు తిరగకుండానే కియారా అద్వానీ ప్రెగ్నెంట్ అంటూ వార్తలు వచ్చాయి. త్వరలోనే కియారా అద్వానీ డెలివరీ ఉంటుందని, ఆ తర్వాత కేవలం రెండు నెలల్లోనే షూటింగ్‌కి కియారా అద్వానీ హాజరు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం కియారా అద్వానీ చేతిలో చాలా సినిమాలే ఉన్నాయి. కనుక త్వరలోనే ఆమె కెమెరా ముందుకు రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.



Printed by RATNA GRAPHICS, at H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Published by CHERUKU UPENDAR on behalf of CHERUKU UPENDAR ( HAMSA PUBLICATIONS ), Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana. *Editor : CHERUKU UPENDAR E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555